ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY






అమరావతికి అందలం

అమరావతికి అందలం.. సంక్షేమానికి జవసత్వాలు.. వివిధ పథకాలకు పూర్వ వైభవం.. పడకేసిన సాగునీటి ప్రాజెక్టులకు పునరుజ్జీవం.. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్లక్ష్యానికి గురైన ప్రతి రంగాన్ని గాడిన పెట్టేలా కూటమి ప్రభుత్వం సోమవారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. వివిధ ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుతో పాటు ఆయా రంగాలపై బడ్జెట్‌లో ప్రత్యేకంగా ప్రాధాన్యం ఇవ్వడంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అమరావతికి బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు జరగడంతో ఇక అభివృద్ధి పనులు పరుగులు తీయనున్నాయి. గత పాలనలో పూర్తిగా నిర్వీర్యమైన సాగునీటి రంగంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఈ క్రమంలో కృష్ణా డెల్టా, పులిచింతలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. అదేవిధంగా భారీ వర్షాలతో తెగిపోయి రైతులను నిండా ముంచేస్తోన్న సాగునీటి కాల్వల బాగుకు కూడా నిధులు కేటాయింపులు జరిగాయి. ఇక విద్యా పరంగా స్కిల్ డెవలప్ మెంట్, విదేశీ విద్య కోసం గతంలో అమలు చేసిన అంబేద్కర్ విదేశీ విద్యోన్నతి పథకం పునరుద్ధరణతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





- రాష్ట్ర బడ్జెట్లో భారీగా కేటాయింపులు
- సంక్షేమానికి జవసత్వాలు.. పథకాలకు పూర్వవైభవం
- రాజధాని అభివృద్ధి ప్రాజెక్టులకు రూ.4 వేల కోట్లకు పైగా
- మెట్రో రైలుకు రూ.50 కోట్లు, హైకోర్టు భవనాలకి రూ.13.3 కోట్లు
- కృష్ణా డెల్టాకు రూ.138.76 కోట్లు.. భూసేకరణకు మరో రూ.50 కోట్లు
- పులిచింతల నిర్వహణకు రూ.29.45 కోట్లు.. గుండ్లకమ్మకు రూ.13 కోట్లు కేటాయింపు




గుంటూరు, బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా పడకేసిన రాజధాని అమరావతి అభివృద్ధితో పాటు నీర్వీర్యమైన వివిధ రంగాలు, ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రత్యేకంగా దృష్టి సారించింది. సోమవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో కూడా ఆయా అంశాలకు ప్రత్యేకంగా ప్రాధాన్యం ఇచ్చారు. ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరం మరో నాలుగు నెలల 20 రోజుల్లో ముగియనున్న దృష్ట్యా ఆ మేరకు ఆశాజనకంగానే కేటాయింపులు చేసింది. ఐదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన ప్రతి రంగాన్ని గాడిన పెట్టేలా కూటమి ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతికి బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురై బడ్జెట్లో ప్రస్తావనకు కూడా నోచుకోని అమరావతికి కూటమి ప్రభుత్వ తొలి బడ్జెట్లో అత్యంత ప్రాధాన్య అంశంగా కనిపించింది. రాజధాని నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు కేటాయించింది. అమరావతి క్యాపిటల్ డెవలప్మెంట్ ప్రాజెక్టుల కోసం ప్రత్యేకంగా రూ.3 వేల కోట్లు కేటాయించింది. స్మార్ట్ సిటీల కార్యక్రమంలో భాగంగా అమరావతికి వేర్వేరుగా నిధుల కేటాయింపు జరిగింది. ఇందులో సీఐటీఐఐఎస్ చాలెంజ్ ప్రోగ్రామ్ కింద రూ.32 కోట్లు, మిషన్ డెవలప్‌మెంట్ స్మార్ట్‌సిటీలో అమరావతికి రూ.50 కోట్లు కేటాయించారు. ఏపీసీఆర్‌డీఏ సహాయ నిధి కింద బడ్జెట్‌లో రూ.1053.70 కోట్లు కేటాయించారు. ల్యాండ్ పూలింగ్ ఫర్ కేపిటల్ సిటీ కోసం రూ.400 కోట్లు కేటాయించారు. నవ్యాంధ్ర రాజధానిగా అమరావతిని నిర్ణయించిననాటి నుంచి మెట్రో రైలు ప్రాజెక్టు రాష్ట్ర ప్రజలను ఊరిస్తూనే ఉంది. 2014- 19ల మధ్య ప్రాధాన్యతను సంతరించుకున్న ఈ ప్రాజెక్టు 2019- 24 మధ్య వైసీపీ హయాంలో ప్రస్తావనకు కూడా నోచుకోలేదు. తాజా బడ్జెట్లో మెట్రో రైలు విభాగానికి రూ.50 కోట్లు కేటాయించి రాష్ట్ర ప్రభుత్వం రాజధాని పట్ల తన చిత్తశుద్ధిని ప్రకటించింది. దీంతోపాటు హైకోర్టు భవనాల నిర్మాణాల కోసం రూ.13.3 కోట్లు, ఏపీ సైన్స్ సిటీ కోసం రూ.2.6 కోట్లు కేటాయించింది. అమరావతికి బడ్జెట్ కేటాయింపులు జరిగిన సోమవారం రోజే రాజధాని అమరావతి మరో మైలురాయిని అధిగమించింది. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి వస్తున్న నిధులకు సంబంధించి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకులతో సీఆర్డీఏ కమిషనర్ సంతకాలతో రుణ ఒప్పందం పూర్తయి నిధులు మంజూరవనున్నాయి. ఇక మంగళగిరిలోని ఎయిమ్స్‌లో నీటి సరఫరా కోసం రూ.5 కోట్లు కేటాయించారు.

సేతు బంధన్ కింద రూ.115.2 కోట్లు

కేంద్ర ప్రభుత్వ పథకమైన సేతబంధన్ కింద చేపట్టబోతున్న రైల్వే ఓవర్ బ్రిడ్జీల నిర్మాణానికి బడ్జెట్‌లో రూ.115.2 కోట్లను చూపించారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని మరికొన్ని జిల్లాల్లో ఆర్‌వోబీలు మంజూరైనప్పటికీ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో గుంటూరులోని శంకర్‌విలాస్ ఆర్‌వోబీ విస్తరణకు వేగవంతంగా అడుగులు పడుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర బడ్జెట్‌లో సేతుబంధన్ కింద కేటాయించిన రూ.115.2 కోట్లలో సింహభాగం నిధులు శంకర్‌విలాస్ ఆర్‌వోబీకి వస్తాయని అధికారులు చెబుతున్నారు.

సాగునీటి ప్రాజెక్టులకు పునరుజ్జీవం

పడకేసిన సాగునీటి ప్రాజెక్టుల పునరుజ్జీవానికి కూటమి ప్రభుత్వం భారీగా నిధుల కేటాయించింది. గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో కృష్ణా పశ్చిమ డెల్టా కింద 5.50 లక్షల ఎకరాలు సాగవుతుండగా రూ.138.76 కోట్లు కేటాయించారు. డెల్టా కింద భూసేకరణ కోసం రూ.50 కోట్లను కేటాయించారు. ఇది గుంటూరు చానల్ పొడిగింపు ప్రాజెక్టు కోసమా.. గోదావరి - పెన్నా నదుల అనుసంధానం కోసమా అనేది తేలాల్సి ఉన్నది. డెల్టాలో పెండింగ్‌లో ఉన్న ఆధునికీకరణ పనుల పూర్తిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకోసం ప్రత్యేకంగా రూ.37.53 కోట్లను కేటాయించింది. దీంతో ఆయా పనులు పూర్తి అవుతాయని అధికారవర్గాలు తెలిపాయి. పులిచింతల ప్రాజెక్టు నిర్వహణని కూడా గత ప్రభుత్వం మరిచింది. దాంతో ఒక దఫా భారీ వరద వచ్చినప్పుడు రేడియల్ క్రెస్టు గేటు కొట్టుకుపోయింది. దాని స్థానంలో స్టాప్‌లాక్ గేటు అమర్చేందుకు జలాశయంలోని నీటిని అప్పటి వైసీపీ ప్రభుత్వం ఖాళీ చేయించింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం పులిచింతల ప్రాజెక్టు నిర్వహణ కోసం రూ.29.45 కోట్లను కేటాయించింది. దీని వలన నిర్వహణ పనులకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఉండవు. గత ప్రభుత్వ వైఫల్యంతో ఏకంగా గేట్లే కొట్టుకుపోయిన గుండ్లకమ్మ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.13 కోట్ల నిధుల కేటాయింపు జరిగింది. ప్రాజెక్టు ప్రకాశం జిల్లాలో పరిధిలో ఉన్నా బాపట్ల జిల్లాలోని అద్దంకి నియోజకవర్గ ప్రజలకు సాగునీటి విషయంలో గుండ్లకమ్మ దోహదపడుతుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో కాల్వలు, వాగుల గట్లు తెగిపోయి పంటలు నీట మునిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వరద నియంత్రణ ప్రాజెక్టుల కోసం బడ్జెట్‌లో రూ.19.55 కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించింది.



ఎన్జీ రంగా వర్సిటీకి.. రూ.507 కోట్లు

గుంటూరు సిటీ: గుంటూరు సమీపంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీకి బడ్జెట్ కేటాయింపుల్లో ప్రభుత్వం పెద్దపీట వేసింది. వైసీపీ హయాంలో వర్సిటీ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ఇటీవల రంగా జయంతి కార్యక్రమానికి హాజరైన వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు వర్సిటీకి పూర్వ వైభవం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా బడ్జెట్‌లో రూ.507 కోట్లు కేటాయించారు. ఈ నిధుల కేటాయింపుతో వర్సిటీకి ప్రభుత్వం జీవం పోసినట్లైంది. భూసార పరీక్షలకు పెద్ద పీట వేయడంతో పాటు, రైతులకు అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి తీసుకురావాలన్న ప్రభుత్వ కృతనిశ్చయం ఈ నిధుల కేటాయింపుతో నెరవేరుతుందని వర్సిటీ వర్గాలు అంటున్నాయి. రైతులకు యంత్ర పరికరాలు, క్రమం తప్పకుండా భూసార పరీక్షలు, ఉద్యాన పంటలకు రాయితీలు, ఆక్వాసాగుకు ప్రోత్సాహకాలకు కూటమి ప్రభుత్వం సుముచిత ప్రాధాన్యం ఇచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా యంత్ర పరికరాలకు దాదాపు రూ.11 కోట్లు, భూసార పరీక్షలకు రూ.3 కోట్ల వరకు కేటాయింపు ఉండొచ్చని తెలుస్తోంది. ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్‌కు రూ.2.50 కోట్లు, ఉద్యాన పంటల రాయితీల కింద రూ.300 కోట్ల వరకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల రైతులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. వడ్డీలేని రుణాలలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వాటా రూ.45 కోట్ల వరకు , రైతు సేవా కేంద్రాలకు సంబంధించి రూ.3 కోట్ల వరకు నిధుల కేటాయింపు దక్కే అవకాశం ఉంది.



ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ

ఎన్టీఆర్‌కు నివాళి..



ఆనవాయితీ ప్రకారం సీఎం చంద్రబాబునాయుడు సోమవారం అసెంబ్లీ సమావేశాలకు వెళ్తూ వెంకటపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూల దండలు వేసి ఘన నివాళి అర్పించారు. ఆయన వెంట మంత్రులు నారాయణ, లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు విశాఖ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, నిమ్మకాయల చినరాజప్ప తదితరులు ఉన్నారు. -తుళ్లూరు

గోతుల్లేని రోడ్ల కోసం..



గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో రోడ్ల మరమ్మతుల కోసం దాదాపు వెయ్యి కోట్ల వరకు అవసరమవుతుందనే అంచనాలను రూపొందించారు. ప్రభుత్వం తాజాగా జరిపిన కేటాయింపుల్లో భాగంగా జిల్లాలకు ఇతోధికంగానే వాటా దక్కనున్నట్లు గణాంకాలు ధ్రువీకరిస్తున్నాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కింద రూ.800 కోట్లు, ఆర్అండ్‌బీ కింద వెయ్యి కోట్ల వరకు నిధులు మూడు జిల్లాల పరిధిలో దక్కనున్నాయి.

సంక్షేమం.. నైపుణ్యం



నామినేటెడ్ పదవుల కోసమే అన్నట్లుగా వెనకబడిన వర్గాల కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వాటిని కుదేలు చేసిన ఘనత గత ప్రభుత్వానిది కాగా కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లు ఆయా వర్గాల సంక్షేమం కోసం బడ్జెట్‌లో ఇతోధికంగా నిధులు కేటాయించింది. ఎస్సీ సంక్షేమం కింద దాదాపు రూ.600 కోట్లు, ఎస్టీ వెల్ఫేర్ కింద రూ.200 కోట్లు, బీసీ సంక్షేమం కింద దాదాపుగా రెండు వేల కోట్లవరకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో కేటాయింపులు జరిగే అవకాశం ఉంది. నైపుణ్యాభివృద్ధి కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధుల కేటాయించగా ఈ నిధుల వ్యయంలో గుంటూరు, బాపట్ల జిల్లాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాలకు అంకురార్పణ జరిగే అవకాశాలున్నాయి

వేమవరంలో పట్టపగలు చోరీ
● 13 సవర్ల బంగారం, రెండు లక్షల నగదు అపహరణ
6
పడవ, బల్లకట్టు రేవులకు నేడు బహిరంగ వేలం

నామమాత్రంగానే సామాజిక తనిఖీ

టెస్ట్ ఆడిట్ జరిగితేనే అక్రమాలు వెలుగులోకి

సామాజిక తనిఖీ బృందం, ఉపాధి సిబ్బంది కుమ్మక్కు

నకరికల్లు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీలో అక్రమాలు వెలుగు చూడాలంటే టెస్ట్ ఆడిట్ జరపాలని ప్రజలు కోరుతున్నారు. ఉపాధి హామీ సిబ్బంది సామాజిక తనిఖీ బృందాలు కుమ్మక్కు కావడంతో అక్రమాలు పూర్తి స్థాయిలో వెలుగు చూడటం లేదని ఆరోపణలున్నాయి. జిల్లాలో అత్యధిక అవినీతి జరిగిన మండలంగా నకరికల్లు పేరు గడించింది. అక్టోబరు 1న ప్రారంభించిన సామాజిక తనిఖీలో స్థానిక ప్రజాప్రతినిధులు లేకుండానే గ్రామసభలు నిర్వహిస్తున్నారు. రూ.10 కోట్ల ఉపాధి నిధులను గత ఆర్థిక సంవత్సరంలో ఖర్చు చేయగా రూ.కోటి మేర దారి మళ్లాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇంకుడు గుంతలు, కాల్వల్లో పూడిక తీత పనుల్లో నిధుల గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలున్నాయి. మృతుల పేరిట మస్టర్ వేసి నిధులను దారి మళ్లించారని, వేలి ముద్రలు లేకపోయినా చెల్లింపులు చేశారని తెలుస్తోంది. రూ.లక్షల్లో నిధులు దారి మళ్లినట్లు అడ్డరోడ్డు, నరసింగపాడు, రూపెనగుంట్ల, చల్లగుండ్ల, చీమలమర్రి, చేజర్ల, నకరికల్లు, గుండ్లపల్లి, కండ్లకుంట, కుంకలగుంట ప్రజలు గ్రామసభల్లో ప్రశ్నించినా సామాజిక తనిఖీ బృందం పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. ఎపీడీవోలు, మెటీరియల్ చెల్లింపులపై లబ్ధిదారులు ప్రశ్నిస్తే ప్రజావేదిక పూర్తయ్యాక ఇస్తామని, అప్పటి వరకు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా ఆడిట్ బృందానికి సహకరించాలని బెదిరిస్తున్నారని సమాచారం. వైసీపీ హయాంలో అక్రమాలకు పాల్పడిన ఇద్దరు అధికారులే ఈ అక్రమాలకు బాధ్యత వహించాలని ప్రజలు పేర్కొంటున్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్ ఫొటో)

8
శివోహం
▸▸ శివనామస్మరణతో మారుమోగిన ఆలయాలు
▸▸ భక్తజన సంద్రంగా అమరావతి అమరేశ్వరాలయం
▸▸ కోటప్పకొండలో భక్తుల కోలాహలం
▸▸ కాకాని మల్లేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి



పెదకాకానిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



సూర్యలంక తీరంలో పుణ్యస్నానాలను ఆచరిస్తున్న భక్తులు, పర్యాటకుల



అమరావతిలోని అమరేశ్వరస్వామి మూలవిరాట్

పార్టీ అండగా ఉంటుంది : ఎమ్మెల్యే ఆనందబాబు


గుంటూరులో చికిత్స పొందుతున్న రాజేంద్రప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లిపర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొమ్మువానిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త తూమాటి రాజేంద్రప్రసాద్‌ను ఇసుక రీచ్‌లో వైసీపీ నాయకులు ట్రాక్టర్‌తో ఢీకొట్టడంతో బలమైన గాయాలయ్యాయి. అతనిని ఆదివారం రాత్రి మెరుగైన వైద్యం నిమిత్తం కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌లో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రాజేంద్రప్రసాద్‌ను సోమవారం హాస్పిటల్‌కు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, దుగ్గిరాల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ నాయకులు ఆళ్ల సురేష్‌రెడ్డి, జి. పొలెష్ తదితరులు ఉన్నారు.

పడవ, బల్లకట్టు రేవులకు నేడు బహిరంగ వేలం

గుంటూరు సిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పడవ, బల్లకట్టు రేవులకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లా పరిషత్‌లోని డిప్యూటీ సీఈవో కార్యాలయంలో సీల్డ్ టెండర్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. అచ్చంపేట మండలంలోని చామర్రు - కాసరబాద (కృష్ణా జిల్లా), చింతపల్లి-ఈస్తేపల్లి (కృష్ణాజిల్లా), గింజుపల్లి-వేదాద్రి (కృష్ణా జిల్లా), తాడువాయి-రామన్నపేట (కృష్ణా జిల్లా), మాదిపాడు-ముక్త్యాల (కృష్ణా జిల్లా), మాదిపాడు-బుగ్గ మాదరం (సూర్యాపేట జిల్లా), మాచవరం మండలం గోవిందాపురం-చింతిర్యాల (సూర్యాపేట జిల్లా), అమరావతి మండలం దిడుగు- ఏటూరు (కృష్ణా జిల్లా), ధరణికోట-కునికినపాడు (కృష్ణా జిల్లా), కొల్లిపర మండలంలోని వల్లభాపురం- వల్లూరుపాలెం (కృష్ణా జిల్లా) రేవులకు వేలం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

15న రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలు

గుంటూరు(విద్య), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాలలో ఈనెల 15న కళాశాల మహిళా సాధికారత సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి.గోపీచంద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భవిష్యత్తు కోసం అమ్మాయి దృష్టి (గర్ల్స్ విజన్ ఫర్ ది ఫ్యూచర్)అనే అంశంపై పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కళాశాల నుంచి ముగ్గురు చొప్పున విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. రిజిస్ట్రేషన్ రుసుం, ఐడీ కార్డు, ప్రిన్సిపల్ అధికారిక లేఖతో రావాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ. 2 వేలు అందిజేస్తామని తెలిపారు.

14న కౌముది కిరణాలు పుస్తకావిష్కరణ

గుంటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న భారతీ విద్యాభవన్‌లో కౌముది కిరణాలు అనే పుస్తకావిష్కరణ జరుగుతుందని సాహితీ సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ, భారతీయ విద్యాభవన్ కార్యదర్శి పి.రామచంద్రరాజు తెలిపారు. కిరణ్ ప్రభ, కాంతికిరణ్‌లతో ఈ సందర్భంగా ఆత్మీయ సమావేశం జరుగుతుందన్నారు. 14న సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సాహితీ లోకానికి కిరణ్ ప్రభ పేరు చిరపరిచితమేనన్నారు. నాలుగు దశాబ్దాల కిందటే 'ఫోటో కవిత' అనే సరికొత్త సాహితీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారన్నారు.

వైన్ షాప్‌పై.. టీడీపీలో వైరం!

- లైసెన్స్‌దారుడు ఎంచుకున్న స్థలం నుంచి మార్చాలని ఓ మంత్రి హుకుం..
- అక్కడ పెడితే అతని మిత్రుని బార్‌కి ఇబ్బందట!
- పర్మినెంట్ లైసెన్స్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు
- రంగంలోకి సీనియర్ టీడీపీ ఎమ్మెల్యేలు
- ఆ షాపును కదిలిస్తే ఊరుకోమని వార్నింగ్

గుంటూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వైన్ షాపుల విషయంలో జోక్యం చేసుకోవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదే పదే చెబుతున్నా ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఓ మంత్రి మాత్రం ఆ వార్నింగ్‌లు తనకు వర్తించవన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. లాటరీలో షాపును దక్కించుకున్న ఓ మద్యం వ్యాపారి గుంటూరు నగరంలోని లక్ష్మీపురం ప్రాంతంలో ఓ షాపును లీజుకు తీసుకొని అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ప్రస్తుతం టెంపరరీ లైసెన్స్‌తో ఆ షాపు నడుస్తుంది. ప్రభుత్వ నిబంధనలకు లోబడే ఆ షాపు ఉన్నప్పటికీ ఇంతవరకు పర్మినెంట్ లైసెన్స్ ఇవ్వకుండా ఎక్సైజ్ అధికారులు కాలయాపన చేస్తున్నారు. కొద్ది రోజులుగా కార్యాలయం చుట్టూ ఆ వ్యాపారి తిరుగుతున్నా పర్మినెంట్ లైసెన్స్ ఇవ్వకపోగా, అతనికి ఓ ఉచిత సలహా ఇచ్చారు. అక్కడ కాకుండా ఇంకొంచెం దూరంలో షాపు చూసుకొని ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన షాపులో సర్వ హంగులు ఏర్పాటు చేసినందుకు రూ. లక్షల్లో ఖర్చు పెట్టిన ఆ వ్యాపారి నిర్ఘాంతపోయాడు. ఎందుకు మార్చమంటున్నారని ఆరా తీయగా ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ మంత్రి ఆ షాపును అక్కడ నుంచి మార్పించాలని హుకుం జారీ చేసినట్టు ఆ షాపు యజమానికి తెలిసింది. దీనికి కారణం ఆ షాపునకు కొద్ది దూరంలో మంత్రిగారి మిత్రుడికి బార్ ఉండటమే. అక్కడ బ్రాందీ షాపు ఏర్పాటు చేయటం మూలంగా ఈ కొద్ది రోజుల్లోనే తన మిత్రుడి బార్‌కు వ్యాపారం తగ్గిపోవటంతో సదరు మంత్రిగారికి కోపం వచ్చిందట. మిత్రుడి కోసం ఆ మంత్రి బ్రాందీ షాపును అక్కడ నుంచి మార్పాల్సిందేనని ఎక్సైజ్ అధికారులపై ఒత్తిడి తేవడం మూలంగా పర్మినెంట్ లైసెన్స్ మంజూరు చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారు. మంత్రి జోక్యం చేసుకున్నారనే విషయం తెలుసుకున్న బ్రాందీ షాపు యజమాని తనకు పరిచయం ఉన్న టీడీపీ సీనియర్ ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి విషయాన్ని విన్నవించుకున్నట్టు తెలిసింది. దీంతో పల్నాడు ప్రాంతానికి చెందిన సీనియర్ ఎమ్మెల్యే ఒకరు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని ఆ షాపును అక్కడ నుంచి కదిలిస్తే ఊరుకోనని ఎక్సైజ్ అధికారులకు వార్నింగ్ ఇచ్చినట్టు తెలిసింది. నిబంధనలకు అనుగుణంగా ఆ షాపు ఏర్పాటు చేసి ఉండకపోతే చెప్పండి తీసేపిస్తా, అంతేగానీ మంత్రి చెప్పాడనో, ఇంకొకరు చెప్పారనో మీరు తల ఊపి తప్పుడు పనులు చేస్తే ఊరుకోనని వార్నింగ్ ఇవ్వటంతో ఎక్సైజ్ అధికారుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిగా మారింది. ఏదైతే అది అవుతుంది న్యాయం పక్షానే నిలుద్దామనే ఉద్దేశంతో మంత్రికి పరిస్థితి వివరించాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. వాస్తవానికి ఈ నెల 10వ తేదీతో పర్మినెంట్ లైసెన్స్‌ల మంజూరు ప్రక్రియ ముగిసిపోవాల్సి ఉంది. ఆదివారం రాత్రి ఆ బ్రాందీ షాపునకు పర్మినెంట్ లైసెన్స్ ఇవ్వాలనే ప్రయత్నంలో ఉండగా ప్రభుత్వం ఈ నెల 15 వరకు గడువు పొడిగించింది. దీంతో ఆ షాపునకు లైసెన్స్ ఇచ్చే ప్రక్రియను మరో రెండు, మూడు రోజులకు వాయిదా వేశారు. ఈ లోగా మంత్రికి పరిస్థితిని వివరించాలని భావిస్తున్నారు.

25 షాపులకు పర్మినెంట్ లైసెన్స్‌లు పెండింగ్

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మొత్తం 256 మద్యం దుకాణాలకు ప్రభుత్వం అనుమతివ్వగా ఇందులో 231 షాపులకు పర్మినెంట్ లైసెన్స్‌లు మంజూరు చేసేశారు. మరో 25 షాపులకు మాత్రం వేర్వేరు కారణాలతో ఇంకా పర్మినెంట్ లైసెన్స్‌లు ఇవ్వలేదు. గుంటూరు జిల్లాలో 11 షాపులకు లైసెన్స్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో ఒకటి లక్ష్మీపురం బ్రాందీ షాపు, మిగతా పది జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నాయి. పల్నాడు జిల్లాలో 14 షాపుల లైసెన్స్‌ల మంజూరు ప్రక్రియ పెండింగ్‌లో ఉంది. కొద్ది రోజుల క్రితం మాత్రం ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు తమ సంగతి ఏంటంటూ వాటాల కోసం, మామూళ్ల కోసం ఒత్తిడి చేయటంతో వారిని ఎలాగానో ఒప్పించుకొని ఏర్పాటు చేసుకున్నారు. కొన్ని చోట్ల షాపులు దక్కించుకున్న వారు రాజకీయ ఒత్తిళ్లు తట్టుకోలేక వదిలేశారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న లైసెన్స్‌ల విషయంలో ఒకటి, రెండు చోట్ల మినహా మిగతా చోట్ల చెప్పుకోదగ్గ అభ్యంతరాలు లేవని అధికారులు చెబుతున్నారు. జాతీయ రహదారుల పక్కన ఉండకూడదనే నిబంధనకు విరుద్ధంగా టెంపరరీ షాపులు ఏర్పాటు చేసుకున్న వారు కొద్ది దూరం వెనక్కి వెళ్లి కొత్త షాపు ఏర్పాటు చేసుకోవటంలో జాప్యం మూలంగా పర్మినెంట్ లైసెన్స్ మంజూరు ప్రక్రియ ఆగిందని, త్వరలో అందరికీ పర్మినెంట్ లైసెన్స్‌లు మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ జట్లు ఇవే..


ఫుట్‌బాల్ రాష్ట్ర స్థాయి బాలికల జట్టు

సత్తెనపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రగతి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేసినట్టు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.నరసింహారావు, పరిశీలకులు డాక్టర్ పి.ప్రభాకర్ సోమవారం ప్రకటించారు. బాలుర జట్టు వివరాలు ఇలా.. జె.మోజెస్ రాజు, ఎం.ముకేష్, ఈవీల్ స్మిత్, ఎ.స్టాలిన్(గుంటూరు), వి.శర్వంత్, బీఎం.సాయిచంద్ర, సీహెచ్.దుర్గాప్రసాదు, సీహెచ్ సందీప్ (విశాఖపట్నం), కె.జయంత్, బి.అభిరామ్ రాజు, బి. ఈశ్వర్(కర్నూలు), కె.సాయి మోక్ష, ఎస్.జోయల్ (ప్రకాశం), ఎ.చైతన్య, పి.మనోజ్ కుమార్ (విజయనగరం), జి.నవదీప్ (కడప), పి.రిషీతేజ (అనంతపురం), ఎ.అబ్దుల్ మజీద్ (చిత్తూరు), స్టాండ్ బైగా బి.ఈశ్వర్ (అనంతపురం), పి.సంగీత్ (కృష్ణ), టి.కుమార్ (తూర్పు గోదావరి) ఎంపికయ్యారు. బాలికల జట్టు వివరాలు ఇలా.. బి.అనూష, ఎస్ఆర్ఎస్ఎస్ శ్రీ, లిఖిత, జి.కీర్తన (అనంతపురం), టి.అరుణ, ఎస్.దీపిక, కె.అంజనాదేవి (వైఎస్ఆర్ కడప), ఎం.పవిత్ర, టి.యామిని, ఎల్ శివ దుర్గ, బి.అఖిల (గుంటూరు), ఎస్ రేష్మ, జి. హేమ ఆసిని (విశాఖపట్నం), జి.హేమశ్రీ, వై.షైనీ (తూర్పు గోదావరి), పి.భవ్య (పశ్చిమ గోదావరి), ఎస్.మహాలక్ష్మి (విజయనగరం), సీహెచ్ పూజిత (ప్రకాశం), స్టాండ్ బైగా దీప్తి (తూర్పు గోదావరి), భవాని (పశ్చిమ గోదావరి), హెచ్ మధు (అనంతపురం), జె.శ్రీలక్ష్మి (గుంటూరు) ఎంపికయ్యారు. బాలికల జట్టు ఎంపిక కమిటీ సభ్యులుగా నారాయణరావు, లాకు పిచ్చయ్య, టి.ప్రకాష్‌రెడ్డి వ్యవహరించారు. బాలుర జట్టు ఎంపిక కమిటీ సభ్యులుగా సిటీ కౌర్, లూర్దుమేరీ, అనిల్ దత్తా నాయక్ వ్యవహరించారు. రాష్ట్ర స్థాయి బాలుర, బాలికల జట్లను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు.

ఉద్యోగాలు, పరిశోధనలకు విజ్ఞాన్ వర్సిటీ పెద్దపీట

- ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్
- వర్సిటీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- విజ్ఞాన్ వర్సిటీ వీసీ ఆచార్య పి.నాగభూషణ్



మాట్లాడుతున్న వీసీ ఆచార్య నాగభూషణ్

గుంటూరు (విద్య), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యువతకు అత్యున్నత ఉద్యోగాలు కల్పించడం, వారిని గొప్ప పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా చేయడం, పరిశోధనలకు పెద్దపీట వేయడం వంటి సమున్నత లక్ష్యాలతో ముందుకెళ్తున్నామని విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి. నాగభూషణ్ సోమవారం తెలిపారు. విజ్ఞాన్ యూనివర్సిటీ 2025-26కు సంబంధించి బీటెక్, బీఫార్మసీ, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఏ ఎల్ఎల్‌బీ (హానర్స్), బీబీఏ ఎల్ఎల్‌బీ (హానర్స్), బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, ఫార్మ్-డీ అడ్మిషన్ల కోసం వీశాట్ - 2025-26 నోటిఫికేషన్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ తాము బీటెక్‌లో అగ్రికల్చర్, బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మాటిక్స్, బయోమెడికల్, కెమికల్, సివిల్, సీఎస్‌ఈతోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్, డేటాసైన్స్, ఐవోటీ, ఈసీఈ, ఈసీఈ వీఎల్ఎస్ఐ, ఈఈఈ, ఫుడ్ టెక్నాలజీ, ఐటీ, మెకానికల్, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, టెక్స్‌టైల్ టెక్నాలజీ, బీఫార్మసీ, ఫార్మాడీ, ఎం.ఫార్మసీ, బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, డిప్లొమా (సీఎస్ఈ. ఈసీఈ) కోర్సులను అందజేస్తున్నామని చెప్పారు. వీటితో పాటు బీఎస్సీ (మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్స్), బీఎస్సీ (ఆక్చూరియల్ సైన్స్), బీబీఏ, బీసీఏ, బీఏ (ఎల్ఎల్‌బీ), బీబీఏ (ఎల్ఎల్‌బీ), ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎంఏ ఇంగ్లిష్, పీహెచ్‌డీ కోర్సులను కూడా అందజేస్తున్నామని చెప్పారు. బీటెక్, బీఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు తాము దేశవ్యాప్తంగా చేపట్టనున్న వీశాట్ ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశం కలదన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీకి అనుబంధంగా ప్రారంభించిన విజ్ఞాన్స్ యూనివర్సిటీ హైదరాబాద్ ఆఫ్ క్యాంపస్‌లో విద్యార్థులకు విభిన్న కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. మార్చి 1 నుంచి ఏప్రిల్ 15 తేదీ వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. వీశాట్‌లో తొలి 50లోపు ర్యాంకులు సాధించిన వారికి 50శాతం, 51 నుంచి 200లోపు ర్యాంకుల వారికి 25 శాతం, 201 నుంచి 2000లోపు ర్యాంకులు సాధించినవారికి 10 శాతం ఫీజు స్కాలర్‌షిప్ అందజేస్తున్నట్లు చెప్పారు. ఇంటర్ మార్కులు, జేఈఈ, మెయిన్స్, ఎంసెట్ ర్యాంకుల ఆధారంగానూ ఫీజు స్కాలర్‌షిప్‌కు అవకాశం ఉందని తెలిపారు. తమ విద్యార్థులు ప్రఖ్యాత సంస్థలైన టీసీఎస్, ఐబీఎం, విప్రో, హెచ్‌సీఎల్, సీటీఎస్, ఇన్ఫోసిస్, ఐటీసీ వంటి తదితర 65 సంస్థల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడుతూ తమ యూనివర్సిటీ బీటెక్ కోర్సుతోపాటుగా ఆసక్తి ఉన్న విద్యార్థులకు సమాంతరంగా సివిల్స్ కోచింగ్ కూడా ఇస్తోందని తెలిపారు. డీన్ అడ్మిషన్స్ డాక్టర్ కేవీ కృష్ణ కిషోర్, డైరెక్టర్ అడ్మిషన్స్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎ.గౌరిశంకర్ రావు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళందే విజయం


బాలికల కబడ్డీ జట్టుకు కప్ అందజేస్తున్న బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పిట్టలవానిపాలెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం బాల, బాలికలు ప్రథమస్థానం సాధించడం అభినందనీయమని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని క్రీడా ప్రాంగణంలో మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పలు జిల్లాలకు చెందిన క్రీడాకారులను వేగేశన నరేంద్రవర్మ పరిచయం చేసుకున్నారు. కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమంలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ పోటీలు బాపట్ల జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి షేక్.కరీముల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు. బాలుర కబడ్డీ పోటీల్లో అండర్-14 స్కూల్‌గేమ్స్ రాష్ట్ర స్థాయిలో శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానం, బాలికల కబడ్డీ పోటీల్లో అండర్ 14 స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయిలో శ్రీకాకుళం జట్టు ప్రథమ స్థానం సాధించాయి. వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.ప్రశాంతబాబు పర్యవేక్షించారు. కార్యక్రమంలో కేర్ విద్యాసంస్థల అధినేత వేగేశన రాధాకృష్ణరాజు, వేగేశన కిషోర్‌రాజు, ఎంఈవోలు ఉయ్యూరి వెంకటేశ్వరరావు, కె.రాజారత్నం, క్రీడాకారులు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేమవరంలో పట్టపగలు చోరీ

- 13 సవర్ల బంగారం, రెండు లక్షల నగదు అపహరణ

మాచవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమవరం గ్రామంలో సోమవారం పట్టపగలు చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జక్కుల సైదులు కూలీల ముఠామేస్త్రిగా పని చేస్తుంటాడు. రోజు వారి లాగానే కూలీలను తీసుకొని పొలానికి వెళ్లాడు. ఇదే అదునుగా గమనించిన చోరులు మధ్యాహ్నం ఇంటికి వేసిన రెండు తాళాలను పగలగొట్టి ఇంటిలోకి ప్రవేశించారు. బీరువాను కూడా పగల గొట్టారు. బీరువాలో ఉన్న 13 సవర్ల బంగారం, రూ.2 లక్షల నగదును దొంగిలించారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి తాళాలు పగలగొట్టి ఉండటంతో లోపలకు వెళ్లి చూడగా బీరువా తీసి ఉంచి, అందులో వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బంగారం తన కుమార్తెదనీ, రూ.2 లక్షల నగదులో రూ. 1.50 లక్షలు కూలీలకు పంచాల్సిన డబ్బులనీ, మరో రూ.50 వేలు తన సొంతమని తెలిపాడు. మాచవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జక్కుల సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. సంఘటనా స్థలాన్ని పల్నాడు జిల్లా క్లూస్ టీమ్ సందర్శించి వేలి ముద్రలు సేకరించారు.

ఎన్నికల హామీల అమలుకు అద్దంపట్టే బడ్జెట్

- మంత్రి అనగాని సత్యప్రసాద్



రేపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల అమలుకు అద్దంపట్టేలా రాష్ట్ర బడ్జెట్ ఉందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా బడ్జెట్ రూపకల్పన చేసి కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అద్భుతమైన బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారన్నారు. సంపదను సృష్టించాలన్న సీఎం ఆలోచనలకు అనుగుణంగా రూపొందించిన బడ్జెట్ ఇదని కితాబు ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా తల్లికి వందనం, ఉచిత బస్సుకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించటం సంతోషకరమన్నారు. నీటి పారుదల శాఖకు గత ప్రభుత్వం కంటే రెండు రెట్లు అదనంగా నిధులు కేటాయించటం రైతుల్లో ఆనందాన్ని నింపుతుందన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ప్రజారంజకంగా రాష్ట్ర బడ్జెట్

- ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



వేమూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో సోమవారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ ప్రజారంజకంగా ఉందని మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడానికి కట్టుబడి ఉన్నామని చెప్పేందుకు బడ్జెట్‌లో పొందుపరిచిన అంశాలే నిదర్శనమన్నారు. సంక్షేమానికి పెద్దపీట వేయడంతోపాటు వ్యవసాయ రంగంలో రైతులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. వ్యవసాయ అనుబంధ శాఖలకు వేర్వేరుగా బడ్జెట్ కేటాయింపులు చేశారని తెలిపారు. రైతు సంక్షేమ పథకాలతోపాటు ప్రాజెక్టు నిర్మాణాలు, రైతాంగ సమస్యల పరిష్కారానికి సంబంధించి బడ్జెట్‌లో గతంలో ఎన్నడూ లేనివిధంగా కేటాయింపులు జరిగాయన్నారు. కేవలం వ్యవసాయమే కాకుండా ఇతర అన్ని శాఖలకు సంబంధించిన విభాగాలకు ఆయా శాఖల ద్వారానే బడ్జెట్ ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు.

ఆర్థిక కష్టాల్లోనూ సానుకూలమైనది

- ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



వినుకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక కష్టాల్లోనూ సానుకూల బడ్జెట్‌ను కూటమి ప్రభుత్వం రూపొందించిందని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్షోభంలో అవకాశాలు వెతకడం సీఎం చంద్రబాబుకు కొత్తమీ కాదనీ అన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ మంత్రి అచ్చెంనాయుడు ప్రవేశ పెట్టిన బడ్జెట్ రాష్ట్రానికి బలమైన పునాదులు వేశాలా ఉందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు తలపెట్టిన స్వర్ణాంధ్ర సంకల్పానికి ఈ బడ్జెట్ నాందిగా చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. సాగునీరు, వ్యవసాయానికి ప్రత్యేక కేటాయింపులు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. నదుల అనుసంధానం పూర్తయితే కరువు విముక్త ఆంధ్రప్రదేశ్ సాకారం అవుతుందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు.

అన్నివర్గాలకు మేలైనది

- ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ అరాచక ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పతనావస్థకు తీసుకెళ్లిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ఆయన హాజరయ్యారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అన్నివర్గాలకు మేలు చేసేదిగా ఉందన్నారు. వ్యవసాయానికి పెద్దపీట వేయడం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు, పంచాయతీరాజ్ రోడ్లకు నిధులు విడుదల, సంక్షేమానికి పెద్దఎత్తున నిధుల కేటాయింపు చూస్తుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మున్ముందు చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. పారిశ్రామికంగా పురోగతి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగయ్యే పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు బాగున్నాయని, అన్నివర్గాలకు ప్రయోజనం చేకూర్చే బడ్జెట్‌గా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

ఎస్ఐ ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 25 లక్షలు వసూలు

రెంటచింతల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐ ఉద్యోగం ఇప్పిస్తామని ఓ అభ్యర్థి నుంచి రూ. 25 లక్షలు తీసుకున్న వ్యక్తిపై ఎస్ఐ సీహెచ్ నాగార్జున కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రెంటచింతలకు చెందిన షేక్ మస్తాన్ బీ డిగ్రీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు హాజరయ్యే నిమిత్తం పేరేచర్లలోని ఓ ఎగ్జామ్ సెంటర్‌కి 2023 ఏప్రిల్‌లో వెళ్లారు. అక్కడ పరిచయమైన లోకేష్ రెడ్డి (కడప జిల్లా వాసి) ఎస్ఐ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి విడతల వారీగా రూ.25 లక్షలు వసూలు చేశాడు. ఎస్ఐ శిక్షణకు సిద్ధం కావాలంటూ తరచూ మెస్సేజ్‌లు పెట్టేవాడు. చివరకు ఇది ఫేక్ అని తెలియడంతో ఈ నెల 4న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 587.10 అడుగులు ఉంది. ఇది 305.56 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 3490 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 16,410 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 16,410 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 290 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా ఆరు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

43,750 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 46,099 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 43,750 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 25,972 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	16000
నెంబరు. 5	10500	14000
273	9000	11500
341	8000	15000
4884	10000	12000
సూపర్ 10	11500	12000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18000
బ్యాడిగి	8000	13500
దేవనూరు డీలక్స్	10000	15500
తెల్లకాయలు	5000	11000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	8500	14000
నెంబరు. 5	9000	13500
273	--	--
341	8500	15500
4884	14000	14000
సూపర్ 10	--	--
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9000	17000
బ్యాడిగి	8000	13000
దేవనూరు డీలక్స్	10000	13500
తెల్లకాయలు	5000	10500

రెండు రోజులు నీటి సరఫరా నిలిపివేత

పిడుగురాళ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి మంచి నీటిని సరఫరా చేసే పైపులైన్‌కు లీకులు ఏర్పడటంతో బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు నీటిసరఫరాను నిలిపివేస్తామని మున్సిపల్ కమిషనర్ పీ శ్రీధర్ తెలిపారు. మరమ్మతుల అనంతరం శుక్రవారం ఉదయం నుంచి పట్టణానికి యథావిధిగా నీటిసరఫరా అందిస్తామన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్‌పై గ్రామసభ

అచ్చంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోనూరులో సోమవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్‌పై గ్రామసభ నిర్వహించారు. సన్న, చిన్న కారు రైతుల పంట చేలల్లో పనులను గుర్తించారు. కూలీలకు పని కల్పించి వారి ఆర్థిక అభివృద్ధికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామంలో పనులను గ్రామసభ ద్వారా గుర్తించి తీర్మానించారు. ఈ గ్రామసభలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, సర్పంచ్ ఏకుల రాములమ్మ, కార్యదర్శి బత్తుల శివయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ చింతపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటుకు 7184 దరఖాస్తులు

● ఇన్‌చార్జి తహసీల్దార్ వాణి



మాచర్లటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కృష్ణ, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు మాచర్ల నియోజకవర్గ పరిధిలో 7184 దరఖాస్తులు అందినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ బత్తుల వాణి తెలిపారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మాచర్ల మండల పరిధిలో 3414, వెల్దుర్తిలో 715, కారంపూడిలో 1063, రెంటచింతలలో 1009, దుర్గి మండలపరిధిలో 983 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. మండలాల వారీగా బూత్ లెవల్ అధికారులు దరఖాస్తులను తనిఖీ చేస్తారని, బీఎల్‌వోలకు సహకరించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ వాణి కోరారు.

రేపటి నుంచి గ్రామాల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

మాచవరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 13వ తేదీ నుంచి గ్రామాల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో పీ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ, జడ్పీటీసీలు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కానున్నట్టు తెలియజేశారు. ఈ శిక్షణా తరగతులు 13, 14 తేదీల్లో నిర్వహిస్తారని ఎంపీడీవో పేర్కొన్నారు.

చర్యలు తీసుకోవాలి



అచ్చంపేట రోడ్డులోని అక్రమ వెంచర్

సత్తెనపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 31వ వార్డు పరిధిలో వావిలాల నగర్ కాలనీ పరిసర ప్రాంతాల్లోని మాగాణి పంట భూములకు సాగునీరు అందించే మైనర్ కాలువలను పూడ్చి వేసిన అక్రమ వెంచర్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతంలోని రైతులు గరికపాటి సతీష్, వెనిగండ్ల హరికృష్ణ, నల్లబిల్లి నరసయ్య, కే హరిలు సోమవారం తహసీల్దార్ చక్రవర్తి, ఎన్‌ఎస్‌పీ అధికారులకు, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆక్రమణలు తొలగించి పొలాలకు నీరు సరఫరా అయ్యేలా చూడాలని కోరారు.

రమేష్‌కు టీడీపీ జీవితకాల సభ్యత్వం

పెదకూరపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఏ రమేష్ పార్టీకి లక్ష రూపాయలు చెల్లించి జీవితకాలపు సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ రమేష్‌ను అభినందించారు.

ఎన్టీఆర్ శుద్ధజల కేంద్రానికి రాజకీయ గ్రహణం

- గతంలో టీడీపీ హయాంలో ఎన్టీఆర్ సృజల స్రవంతి పథకం కింద ప్రారంభం
- రూ.5లకే 20 లీటర్ల స్వచ్ఛమైన తాగునీరు
- వైసీపీ వచ్చాక మూసివేతకు గురైన తీరు
- కూటమి ప్రభుత్వంలో నైనా వినియోగంలోకి వచ్చేనా?!

పెదకూరపాడు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాలకు సైతం శుద్ధి చేసిన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో గతంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ సృజలస్రవంతి పథకానికి రాజకీయ గ్రహణం పట్టింది. ఎంతో మందికి పరిశుభ్రమైన తాగునీటిని అందించిన శుద్ధజల కేంద్రాలను వైసీపీ ప్రభుత్వం మూలనపడేసింది.



పెదకూరపాడు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరుపయోగంగా ఉన్న ఎన్‌టీఆర్ శుద్ధజల కేంద్రం

పెదకూరపాడులోని అంబేద్కర్ సెంటర్లో సుమారు 500 పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. నాటి పెద కూర పాడు ఎమ్మెల్యే ప్రస్తుత టీడీపీ పల్నాడు జిల్లా జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ప్రత్యేక శ్రద్ధతో ఎన్‌టీఆర్ సృజల స్రవంతి పథ కం ద్వారా శుద్ధ జలకేంద్రాన్ని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయించారు. ప్రజలకు 20 లీటర్ల శుద్ధజలాన్ని కేవలం రూ.5లకే అందించారు. అనంతరం అధికారంలోకి వచ్చి న వైసీపీ ఈ శుద్ధ జలకేంద్రం సజావుగా పని చేసినం త వరకు ఉపయోగించి మరమ్మతులకు గురికాగానే పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో శుద్ధ జలకేంద్రం పరికరాలు తుప్పు పట్టి ఎందుకు పనికి రాకుండా పోయాయి. సుమారు నాలుగు సంవత్సరాలకు పైగా ఈ ప్లాంట్ ఉపయోగంలో లేకపోవటంతో ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు పడ్డారు.

ప్రైవేటు ప్లాంట్లకు కాసుల వర్షం..

ప్రభుత్వ శుద్ధ జలకేంద్రం నిరుపయోగంగా మారటంతో ప్రైవేట్ శుద్ధ జల కేంద్రాలకు కాసుల వర్షం కురుస్తోంది. శుద్ధజలం తాగడానికి అలవాటైన ప్రజలు తాగునీటిని ప్రైవేటు ప్లాంట్లలో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రైవేట్ వాటర్ ప్లాంట్ నిర్వాహకులు 20 లీటర్ల నీటిని రూ.15లకు అమ్ముతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా నిరుపయోగంగా ఉన్న ఈ శుద్ధ జలకేంద్రంపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా శుద్ధ జలకేంద్రాన్ని వినియోగంలోకి తీసుకు వస్తే ప్రజలకు తక్కువ ధరకే స్వచ్ఛమైన శుద్ధజలం లభిస్తుందని స్థానికులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

శివాలయాల్లో కార్తీక సోమవార పూజలు

రాజుపాలెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా బలిజేపల్లి, ఆకుల గణపవరం, నెమలిపురి, ఉప్పల పాడు, గంగిరెడ్డిపాలెం తదితర గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి సమయంలో భజన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



గంగిరెడ్డిపాలెం శివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

● సత్తెనపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం కావటంతో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. పట్టణంలోని రెండు శివాలయాల్లో శివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు.

అమరలింగేశ్వరుడికి అభిషేకాలు



దైద బిలంలో భక్తులు

గురజాలటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దైద బిలంలో ఉన్న శ్రీగంగా పార్వతి సమేత అమరలింగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. కృష్ణానదిలో స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికంగా రావడంతో బిలం కిక్కిరిసిపోయింది.

● క్రోసూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవాలయాల్లోని మారేడు, ఉసిరి చెట్లు, నవగ్రహాల వద్ద మహిళలు దీపారాధనలు చేశారు. క్రోసూరులోని పురాతన కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం, వీరభద్ర స్వామి దేవాలయాల్లో పూజలు నిర్వహించారు.

రూపెనగుంట్లలో టీటీడీ కార్తీకమాస మహోత్సవం

నకరికల్లు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రూపెనగుంట్లలోని గంగాపార్వతి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరు ఆధ్వర్యంలో కార్తీకమాస మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

కపోతేశ్వర ఆలయంలో లక్ష దీపోత్సవం

చేజెర్ల కపోతేశ్వర ఆలయంలో లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. ఏఎంరెడ్డి గ్రూప్ విద్యాసంస్థల సెక్రటరీ & కరస్పాండెంట్ అట్లూరి శాంతి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు, అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.



పట్టణంలోని భీమవరం రైల్వే గేటును పట్టాల మరమ్మతుల దృష్ట్యా సోమవారం అధికారులు మూసి వేశారు. **(సత్తెనపల్లి)**

కాంగ్రెస్ కో-ఆర్డినేటర్‌గా చంద్రపాల్

సత్తెనపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్‌గా చుక్కా చంద్రపాల్‌ను కాంగ్రెస్ పార్టీ అధిష్టానవర్గం నియమించింది. ఈ సందర్భంగా చంద్రపాల్‌ను పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం మౌలానా అబుల్ కలాం అజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రుద్రవరం పాఠశాలకు ఎంఈవో

అచ్చంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓర్వకల్లు ఎంపీపీ, యూపీ పాఠశాలలను సోమవారం ఎంఈవో ఏకుల ప్రసాదరావు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి వారి సామర్థ్యాలను పెంపొందింప జేయాలని సూచించారు.

సమస్య ఇది.. స్పందించరూ





మాచర్ల రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపల్లి బ్రిడ్జి వద్ద నుంచి కుడి కాలువ పక్కగా విజయపురిసౌత్‌కు చేరుకునే రహదారి వెంబడి కంపచెట్లు విరివిగా పెరిగిపోయాయి. ఈ కంపచెట్లు రహదారిపైకి వాలిపోయి ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు వాహనాలు ఎదురుగా వస్తే రోడ్డు మార్జిన్‌ను ఆనుకొని కంపచెట్లు ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కంప చెట్లను తొలగించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

తోటి ఎమ్మెల్యేలతో భాష్యం ప్రవీణ్ ఆత్మీయ సమావేశం



సహచర ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్న భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తన సహచర ఎమ్మెల్యేలతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. వెలగపూడిలో జరిగిన అసెంబ్లీ సమావేశం అనంతరం విజయవాడలో తోటి ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌బాబు, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే థామస్, ఉదయగిరి ఎమ్మెల్యే సురేష్‌లతో కలసి పలు విషయాలపై చర్చించారు.

ఆ రోడ్డులో మద్యం దుకాణాలకు అనుమతి వద్దు



రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య నేతలు, మహిళలు

పిడుగురాళ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జానపాడు రోడ్డు, అమ్మవారి గుడి, వివేకా కోచింగ్ సెంటర్ సమీపాల్లో మద్యం షాపులకు అనుమతి ఇవ్వొద్దని పట్టణ ఆర్యవైశ్య సంఘ నేతలు, మహిళలు సోమవారం డీటీ సుధాకరశర్మకు ఫిర్యాదు చేశారు. ఆ వీధిలో దేవాలయాలున్నాయని, నిత్యం మహిళలు ఆ రహదారిలో వెళ్లాల్సి ఉన్నందున ఇబ్బందులను గుర్తించి మద్యం దుకాణాలకు అనుమతులు ఇవ్వొద్దంటూ ఫిర్యాదు చేశారు.

మహిళల ఆర్థిక అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● మండల సమాఖ్య నూతన కార్యవర్గ ఎన్నిక



మండల సమాఖ్య నూతన కమిటీతో టీడీపీ స్థానిక నాయకులు

దాచేపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలనే లక్ష్యంగా డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేశారని మండల సమాఖ్య నూతన కార్యవర్గ సమావేశానికి హాజరైన పలువురు నేతలు తెలిపారు. సోమవారం దాచేపల్లిలోని స్త్రీశక్తి భవనంలో మండల సమాఖ్య ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో నూతన కమిటీ అధ్యక్షురాలిగా పెదగార్లపాడు గ్రామానికి చెందిన కటికాల సునీత, ప్రధాన కార్యదర్శిగా కేశానుపల్లికి చెందిన శ్రీపతి బుజ్జి, కోశాధికారిగా ఆసం రమణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరైన ఏపీఎం కొమ్ము రవి, టీడీపీ మండల కన్వీనర్ బెల్లంకొండ భద్రి, నెల్లూరి రామకోటయ్య, చింతపల్లి హసన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసింది టీడీపీ ప్రభుత్వంలోనేనని తెలిపారు.

మృతురాలి కుటుంబానికి టీడీపీ నేతలు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న టీడీపీ నేతలు

మాచర్ల రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద అనుపునకు చెందిన సావిటి లింగమ్మ గత ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు గ్రామానికి చేరుకొని ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేల నగదును బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నూన్సావత్ గోపినాయక్, రంగానాయక్, దేవుడమ్మ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ నేతలను కలిసిన గురజాల నేతలు



మహ్మద్ షరీఫ్‌ను కలిసి అభినందిస్తున్న మైనారిటీ సెల్ నాయకులు

పిడుగురాళ్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): భారతరత్న మౌలానా అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా పల్నాడు జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌అలి ఆధ్వర్యంలో సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మైనారిటీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారుగా నియమించిన మహ్మద్ అహ్మద్ షరీఫ్‌ను కలిశారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ముస్తాక్ అహ్మద్‌ను, మహ్మద్ అహ్మద్ షరీఫ్‌ను మైనారిటీ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్ర మాల్లో షేక్ సైదావలి, గుత్తికొండ సుభాని, ఖలీల్, షేక్ అబ్దుల్లా, షేక్ ముజీబ్, షేక్ సైదా, నాయబ్ అబ్దుల్లా, టీడీపీ మస్తాన్‌వలి, చికెన్ జానీబాష, నాగరాజు యాదవ్, సైదా తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం జయంతి

సత్తెనపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో సోమవారం స్వాతంత్ర్య సమర యోధుడు మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చౌట శ్రీనివాసరావు, సయ్యద్ పెద కరీముల్లా, సయ్యద్ మాబూ, నూర్‌బాషా, జానీబాబు, షేక్ చిన అబ్దుల్ నబీ, రాంబో బుడే, జానీ ఖాజావలి, కంభాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల నిర్ణయంపై హర్షం

క్రోసూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ తరువాతనే డీఎస్సీ నోటి ఫికేషన్ ఇస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అసెంబ్లీలో ప్రకటించటంపై పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. 16,500 ఉపాధ్యాయుల పోస్టులకు ఈ నెలలో నోటిఫికేషన్ విడుదల చేస్తామని తొలుత ప్రకటించారని సంఘాల డిమాండ్ మేరకు ఎస్సీ వర్గీకరణ తరువాతనే నోటిఫికేషన్ విడుదల చేయాలన్న నిర్ణయం నిరుద్యోగులకు మేలు చేస్తుందన్నారు. యూటీఎఫ్ నాయకులు బీ నరసింహారెడ్డి, ఎన్ ప్రకాశరావు, కే లక్ష్మణరావు, ఎస్‌టీయూ నాయకుడు రాఘవ తదితరులు హర్షం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

బిగ్‌హెల్ప్ సేవలు అమూల్యమైనవి : ఎంఈవో

మాచర్లటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పేదల విద్యాభివృద్ధికి బిగ్‌హెల్ప్ సంస్థ చేస్తున్న సేవలు అమూల్యమైనవని ఎంఈవో కాంతారావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వోన్నత బాలుర హైస్కూల్లో బిగ్‌హెల్ప్ సంస్థ సహకారంతో నూతనంగా నిర్మించిన ఆడిటోరియంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బిగ్‌హెల్ప్ సంస్థ వ్యవస్థాపకుడు చాంద్‌బాషా రూ.5 లక్షలతో నిర్మించిన ఈ ఆడిటోరియంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం చాంద్‌బాషాను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బిగ్ హెల్ప్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాటి భాస్కరబాబు, హెచ్‌ఎంలు రామారావు, షకీనా, ట్రస్టీలు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూలు అభివృద్ధికి కృషి చేస్తాం

డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, కొల్లి బ్రహ్మయ్య

నకరికల్లు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుంకలగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అన్ని వసతులతో కూడిన ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుతామని పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం గౌరవ అధ్యక్షులు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, కొల్లి బ్రహ్మయ్య అన్నారు. సోమవారం కుంకలగుంటలోని జడ్పీ హైస్కూలును పాఠశాల పూర్వ విద్యార్థుల బృందం పరిశీలించింది. హెచ్‌ఎం కె.మేరీరాణితో సమావేశమయ్యారు. పాఠశాలలో వంటగది, డైనింగ్ హాలు ఏర్పాటు చేయాలని, సైకిల్ స్టాండును నిర్మించాలని కోరారు. నాడు - నేడు కింద నిర్మించాల్సిన నిర్మాణాలు నిలిచి పోయాయని తెలిపారు. పాఠశాలల ప్రహరీ ఎత్తు పెంచే విధంగా నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని, అర్వపల్లి వీర హరనాద్‌బాబు, పసుపులేటి నాగ శ్వరరావు, కనుమూరి సాంబశివరావు, పేరెంట్స్ కమిటి చైర్మన్ రామిశెట్టి హనుమంతరావు, ఉప సర్పంచ్ శింగరాజు అంకారావు, ఆవుల సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అసభ్యకర పోస్టు పెడితే జైలుకే

● డీఎస్పీ హనుమంతరావు

సత్తెనపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సభ్యసమాజం సిగ్గుపడేలా సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారని డీఎస్పీ హనుమంతరావు తెలిపారు. ఎవరైనా అసభ్యకర పోస్టులు, వీడియోలు, చిత్రాలు పంపితే వెంటనే సమీపంలోని స్టేషన్లో ఫిర్యాదు చేయాలని అన్నారు. సమాచార వ్యాప్తికి బాధ్యులు ఎవరో గుర్తిస్తామని చెప్పారు. విషపూరిత సమాచార మార్పిడి విషయాల్లో భాగస్వాములు కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని సూచించారు. తప్పుడు పోస్టులు పెట్టే వారు కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తు అంధకారమవుతుందని డీఎస్పీ హెచ్చరించారు.

నైపుణ్యగణనపై శిక్షణ

నకరికల్లు, నవంబరు 11: (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బందికి నైపుణ్య గణనపై సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. 15 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు గల వారికి ఫోన్లో మొబైల్ అప్లికేషన్‌పై నైపుణ్య గణన విధానాన్ని తెలిపారు. కార్యక్రమంలో నైపుణ్య శిక్షణా అధికారి రామకృష్ణారెడ్డి, ఎంపీడీవో కాశియ్య, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో సౌకర్యాలు కల్పించాలి

సత్తెనపల్లి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్నం గురవమ్మ కృష్ణమూర్తి డిగ్రీ కళాశాలలో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, తక్షణం సౌకర్యాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ రవికి సోమవారం వినతిపత్రం అందించారు. సత్తెనపల్లి పరిసర ప్రాంతాల నుంచి ఎంతో మంది పేద విద్యార్థులు ఈ కళాశాలలో చదువుతున్నారని, గదులు, మంచి నీటి సౌకర్యం కూడా కళాశాలలో లేవని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు షాదుల్లా, ఫణీంద్ర, జడ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రజలపై ట్రూఅప్ చార్జీలు మోపడం అన్యాయం

● సీపీఎం జిల్లా నేత ఆంజనేయులు నాయక్

మాచర్లటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెరగవని చెప్పి ఇప్పుడు ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం అన్యాయమని సీపీఎం జిల్లా నేత ఆంజనేయులు అన్నారు. సోమవారం పట్టణంలో సీపీఎం ఆధ్వర్యాన నిర్వహించిన ప్రజాపోరు ప్రచార యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు బండ్ల మహేష్, సురేష్, వెంకటరత్నం, శోభన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల, మహిళల రక్షణకు చట్టాలపై అవగాహన



చైల్డ్‌యాక్ట్ బుక్‌లెట్స్‌ను చూపుతున్న ఐసీడీఎస్ సిబ్బంది

నకరికల్లు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాలికల, మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో జి.కాశయ్య తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో బేటీ బచావో - బేటీ పఢావో కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో పి.శ్రీలత, ఏసీడీపీవో, సూపర్‌వైజర్లు, ఈవోపీఆర్‌డీ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

రెంటచింతల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అవివాహితుడైన కొత్త అఖిల్ (26) బీటెక్ పూర్తి చేసి కొంతకాలం సాఫ్ట్‌వేర్‌లో ఉద్యోగం చేశాడు. ఇటీవల ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి ఖాళీగా ఉంటున్నాడు. సోమవారం రెంటచింతలకు వచ్చి తండ్రి అంజి, తమ్ముడు అనుదీప్‌తో చాలా సమయం గడిపాడు. మధ్యాహ్నం నుంచి సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. ఎక్కడికి వెళ్లింది ఎవరికీ తెలియలేదు. సోమవారం రాత్రి అఖిల్ తల్లిదండ్రులు తమ కుమారుడు కనిపించడం లేదంటూ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

● సీనియర్ టీడీపీ నాయకుడు ఆర్యవైశ్య నేత కొత్త అంజి కుమారుడు అఖిల్ అదృశ్యమైన విషయాన్ని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సమగ్ర దర్యాప్తు చేయాలని ఎస్ఐ నాగార్జునను ఆయన ఆదేశించారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

క్రోసూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంఈవో -2 గణేష్ అన్నారు. సోమవారం 88 తాళ్ళూరు ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. మెను ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను వాకబు చేశారు.



శివోహం..

- శివనామస్మరణతో మారుమోగిన ఆలయాలు
- ఆలయ ప్రాంగణాల్లో కార్తీక దీపారాధనలు
- భక్తజన సంద్రంగా అమరావతి అమరేశ్వరాలయం
- కోటప్పకొండలో భక్తుల కోలాహలం
- కాకాని మల్లేశ్వరుడికి ప్రత్యేక పూజలు

పవిత్ర కార్తీకమాసం రెండవ సోమవారం ఆలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. 'ఓం నమశ్శివాయ.. హర హర మహాదేవ.. శంభో శంకర' మంత్రోచ్ఛరణలను పఠిస్తూ భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అమరావతి శ్రీ అమరేశ్వరాలయం, పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం, నరసరావుపేట కోటప్పకొండలోని శ్రీ త్రికోటేశ్వర స్వామి ఆలయం, బాపట్ల పట్టణంలోని శ్రీసోమేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే ప్రముఖ పర్యాటక ప్రాంతం సూర్యలంక సముద్ర తీరంలో భక్తులు కార్తీకమాస పుణ్యస్నానాలను ఆచరించి, పూజలను నిర్వహించారు.

అమరావతి, నరసరావుపేట, బాపట్లరూరల్, పెదకాకాని, నవంబరు 11, (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం రెండవ సోమవారం పంచారామ క్షేత్రాలలో ప్రథమ ఆరామంగా దేవేంద్రునిచే ప్రతిష్ఠించినట్లు పేర్కొన్న అమరావతిలోని అమరేశ్వరాలయం భక్తజనంతో సంద్రంగా మారింది. పంచారామాలు దర్శించుకునే భక్తులు ఆదివారం అర్ధరాత్రి నుండి ప్రత్యేక వాహనాలలో ఆలయానికి చేరుకుని తెల్లవారు జామున రెండు గంటలనుండి పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి కార్తీకదీపాలు వెలిగించారు. కార్తీకదీపాలను కృష్ణమ్మ అలలపై వదలి ఆరనీకుమా ఈదీపం కార్తీకదీపం అంటూ తమ భక్తిభావం చాటుకున్నారు. అనంతరం స్వామివారి దర్శనం చేసుకున్నారు. భక్తులు అధికసంఖ్యలో రావడంతో కృష్ణాతీరం, ఆలయ ప్రాంగణము, ప్రధాన రహదారిలో భక్తుల రద్దీ అధికంగా కనిపించింది. భక్తులకు ఆలయ అధికారులు తాగునీరు, ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. ఏఎస్పీ లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో డీఎస్పీ ఎం.హనుమంతరావు పర్యవేక్షణలో పలువురు సీఐలు, ఎస్ఐలు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి పీ.సునీల్‌కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. కార్తీకదీపాలతో కృష్ణాతీరం వెలుగులు విరజిమ్మింది. పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు దంపతులు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



శ్రీ త్రికోటేశ్వర స్వామికి వైభవంగా రుద్రాభిషేకం

ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలో కార్తీక సోమవారం పురస్కరించుకొని శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. శ్రీమేధా దక్షిణామూర్తి స్వరూప శ్రీత్రికోటేశ్వర స్వామికి పంచామృతాలతో విశేష ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. విశేష పుష్పాలకంరణ సేవ జరిగింది. తెల్లవారు జామునుంచే వేలాదిగా భక్తులు కొండకు తరలివచ్చి శ్రీత్రికోటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున భక్తులు దీపారాధనలు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో డీ చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్టీసీ అధికారులు నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి కొండకు ప్రత్యేక సర్వీసులు నడిపారు.



సూర్యలంక తీరం ఒడ్డున కార్తీకమాస పూజలు

ఎంతో పవిత్రమైన కార్తీకమాసం రెండోవ సోమవారం బాపట్ల సూర్యలంక సముద్రతీరంలో భక్తులు పూజలను వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే తీరంకు చేరుకొని భక్తులు సూర్యలంకతీరంలో పుణ్యస్నానాలను ఆచరించి తీరం ఒడ్డున ఇసుకతిమ్మెలతో శివలింగాలను నిర్మించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహిళా భక్తులు తీరం ఒడ్డున కార్తీకదీపాలను వెలిగించి పూజలను నిర్వహించి అనంతరం సముద్రదేవునికి తాంబూలాన్ని సమర్పించారు. తీరం ఒడ్డున కార్తీక పూజలు జరిపిన అనంతరం బాపట్ల పట్టణంలోని శ్రీసోమేశ్వరస్వామి ఆలయానికి తరలి వెళ్ళి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్తీక మాసం రెండోవ సోమవారం కావటంతో సూర్యలంకతీరం భక్తులతో పరవశించిపోయింది. తీరానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బాపట్లరూరల్, మెరైన్ పోలీసులు బందోభస్తును నిర్వహించారు.





బాపట్ల సూర్యలంక సముద్రతీరం ఒడ్డున ఇసుకతో శివలింగాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కాకాని మల్లన్న సన్నిధిలో
కార్తీక దీపాలంకరణలు

పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలోని యజ్ఞాల బావి వద్ద భక్తులు కార్తీకమాస స్నానమాచరించి అనంతరం స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణములో కార్తీక దీపారాధనలు చేశారు. క్యూలలోని భక్తులకు ఉచితంగా పాలు, మజ్జిగ, తాగు నీరు అందించారు. శ్రీ స్వామి వారి నిత్య అన్నప్రసాద భవనంలో భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కళ్యాణ కట్ట వద్ద పలువురు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయ అన్ని విభాగాలలోని కార్యక్రమాలను ఆలయ ఉప కమిషనరు కేబీ శ్రీనివాసరావు పర్యేవేక్షించారు. కార్తీకమాస 2వ సోమవారం వివిధసేవా రుసుములు, ప్రసాదం విక్రయం, అన్నప్రసాద విరాళములు ద్వారా రూ.6,50,000 పై చిలుకు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఉప కమిషనరు తెలిపారు. పోలీసు, అగ్నిమాపక, పంచాయతి, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, సిబ్బంది విధుల్లో పాల్గొన్నట్లు ఉప కమిషనరు తెలిపారు.

అమరావతికి ఆన్‌లైన్ రివర్ వాటర్
క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్

- ఔత్సాహికుల నుంచి టెండర్లు ఆహ్వానం

విజయవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి నగరానికి సురక్షిత మంచినీటిని అందించేందుకు వీలుగా సీఆర్‌డీఏ అధికారులు 'ఆన్‌లైన్ రివర్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్' ఏర్పాటుకు ఈవోఐ పిలిచారు. రాజధాని ప్రాంతానికి అందించే మంచినీరు అత్యున్నత ప్రమాణాలతో ఉండాలన్న ఉద్దేశంతో ఎప్పటికప్పుడు కృష్ణానదిలోని నీటి వనరుల నాణ్యతను పరిశీలించేందుకు ఈ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని సీఆర్‌డీఏ నిర్ణయించింది. ఇదంతా ఆన్‌లైన్ విధానంలో పని చేస్తుంది. ఆన్‌లైన్ రివర్ వాటర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్ ఏర్పాటుకు సంబంధించిన టెండర్లను సీఆర్‌డీఏ కోరింది. ఈ నెల 15వ తేదీలోపు ఔత్సాహికులు తమ టెండర్లను అందజేయాలని తెలిపింది.

అభివృద్ధి, సంక్షేమానికి
రాష్ట్ర బడ్జెట్ దోహదం

జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరుసిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర సంక్షేమం అభివృద్ధికి దోహదపడుతుందని ఉమ్మడి గుంటూరుజిల్లా పరిషత్ ఛైర్మన్ కత్తెర హెనీ క్రిస్టీనా తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌పై సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభ్యున్నతికి రూ. 2లక్షల 94వేల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేస్తుందన్నారు. ముఖ్యంగా పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధిశాఖకు రూ.16,739కోట్ల కేటాయింపు హర్షణీయమన్నారు. అదేవిధంగా బీసీ సంక్షేమానికి రూ.39 వేల ఏడు కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ.18,497కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.7557 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి రూ.4,376 కోట్లు, మహిళశిశు సంక్షేమానికి రూ.4285 కోట్లు, గృహ నిర్మాణానికి రూ.4012 కోట్లు, పరిశ్రమలు వాణిజ్యానికి రూ.3127 కోట్లు, ఇంధన రంగానికి రూ.8207 కోట్లు, పట్టణ అభివృద్ధికి రూ.11490కోట్లు కేటాయించడం అభినందనీయమని అన్నారు. ఇంకా కొన్నిశాఖలకు ప్రభుత్వం కేటాయించిన నిధులవలన ప్రయోజనం కలుగుతుందని, గతప్రభుత్వంలో బడ్జెట్‌లో కేటాయించినవి ఆయాశాఖలకు అందలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.

గంజాయి మత్తులో విద్యార్థులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వీరేంద్రబాబు, కింద కూర్చొనివున్న నిందితులు

- 25 మంది సభ్యుల ముఠా అరెస్టు
- 7.2 కిలోల గంజాయి స్వాధీనం
- నిందితుల్లో అత్యధిక మంది ఇంటర్, డిగ్రీ విద్యార్థులే ..
- వివరాలు తెలిపిన గుంటూరు పట్టాభిపురం సీఐ .. మిగిలిన వారిని పట్టుకుంటామని వెల్లడి

గుంటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తున్న ఏడుగురుతో పాటు తాగుతున్న 18 మందిని పట్టాభిపురం పోలీసులు సోమవారం అరెస్ట్ చేసారు. వారి నుంచి 7.2 కిలోల గంజాయి, రూ. 3,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడినవారిలో ఎక్కువ మంది ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఉండటం ఆందోళన కలిగించే విషయం. పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వీరేంద్రబాబు ఈ కేసులోని నిందితుల వివరాలను వెల్లడించారు.

నగరంలో శ్రీనివసరావుపేట, సంగడిగుంట, చంద్రాబాబు కాలని, పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం పిచికలపాలెం గ్రామానికి చెందిన అల్తాఫ్ దావుద్దిన్, రోషన్, యూసుఫ్‌లు ముగ్గురు ఓ కాలేజీలో ఇంటర్ రెండవ సంవత్సరం, అనిల్ డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్నారు. యూసుఫ్ మెకానిక్ గాను, సుధాకర్ వంట మేస్త్రి గాను, బాలాజీ కూలి పనులు చేసుకుంటూ ఉండేవారు. వీరంతా గంజాయి, చెడు అలవాట్లకు బానిసలుగా మారి తమ వ్యసనాలకు అవసరమైన డబ్బుల కోసం గంజాయి అమ్మేందుకు సిద్ధపడ్డారు. ఈ క్రమంలో అల్తాఫ్, దావుద్దిన్, రోషన్, బాలజీలు గత నెల 8న వారి ద్విచక్రవాహనాలపై అరకు వెళ్లి భీం, దీపక్ అనే ఇద్దరి వద్ద గంజాయి కొన్నారు. గుంటూరులో గంజాయిని ఇతరులకు లాభానికి అమ్మే అనిల్, సుధాకర్‌లను కలిశారు. వీరంతా సోమవారం నేతాజీ నగర్ చెరువు వద్దకు వచ్చి ఉండగా పట్టాభిపురం పోలీసులు వారిని పట్టుకుని, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అరకు నుంచి గంజాయి తెచ్చి అమ్ముతున్న శ్రీనివాసరావుపేట 11వ లైనుకు చెందిన షేక్ అల్తాఫ్, సంగడిగుంట 11వ లైనుకు చెందిన మొహమ్మద్ దావుద్దిన్, శ్రీనివాసరావుపేట 1వ లైనుకు చెందిన షేక్ యూసుఫ్, తన్నీరు బాలాజీ, కొత్తపేట 1వ లైనుకు చెందిన షేక్ రోషన్, శావల్యాపురం మండలం పిచికలపాలెంకు చెందిన ఏగినాటి. అనిల్, చంద్రబాబు కాలని 6వ లైను, పొన్నూరు రోడ్డుకు చెందిన పందిరి సుధాకర్ తదితరులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

అదే విదంగా గంజాయి తాగుతున్న గౌడ లిఖిత్ (నల్లపాడు), కుంచేపు శ్యాం కుమార్ (కేవీపీ కాలనీ), పాకాల కిరణ్ బాబు (గడ్డిపాడు), సిరిగిరి వెంకట శివ (శ్రీనివసరావుపేట 6వ లైను), తోట వెంకటేష్(బ్రాడిపేట 6/21), అవుకు సాయి తేజ (పాతిమా పురం 4వ లైను), మద్దు మౌనిష్ (శ్రీనివసరావుపేట సుజాత కాన్వెంట్ వెనుక), ఆలపాటి వెంకట సుధీర్ బాబు (కొరిటెపాడు), పెద్దింటి చరణ్ (చాగల్లు గ్రామం, తూర్పు గోదావరి జిల్లా), కొప్పుల నితిన్ (డొంకరోడ్డు, కాకుమానువారి తోట), యామ ప్రణవ గణేష్ (బాలాజీ నగర్ 4వ లైను, రెడ్డిపాలెం), కొక్కిలిగడ్డ దిలీప్(మైనేని కాలని), భూషణ్ పాణిగ్రాహి(మెళియాపుట్టి, రాత్తిని, శ్రీకాకుళం జిల్లా), హరికొట్ల జయంత్(ఖమ్మం పట్టణం), అబ్బూరి భాస్కర్(ఖమ్మం పట్టణం), పుట్టగుంట రానసింహ దత్తు(జేకేసీ కాలేజీ రోడ్డు), మన్నే తులసిరాం (నాయుడుపేట 2వ లైను కొరిటెపాడు), బిల్లా రబ్బాని (కేవీపీ కాలని1/4) తదితరులను అరెస్ట్ చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేసారు. అదేవిధంగా అరకులో వీరికి గంజాయి విక్రయించిన భీం, దీపక్‌లను అరెస్ట్ చేయాల్సి ఉందని సీఐ వీరేంద్రబాబు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసిన సీఐ వీరేంద్రబాబు, ఎస్ఐ నరహరి, ఏఎస్ఐ ఆంజనేయులు, హెడ్ కానిస్టేబుళ్ళు వాకా రామారావు, బీ నరసింహారావు, కానిస్టేబుళ్ళు వై మానిక్యాలరావు, బీ బ్రహ్మం, సైదులు, పీ శివనాగరాజు, శేఖర్ తదితరులను ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించి రివార్డులు ప్రకటించారు.

బడుగు, బలహీనవర్గాల ఆశీస్సులే
నా ఎదుగుదలకు కారణం

- టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి



మాట్లాడుతున్న టీటీడీ పాలక మండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'నా రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తు పల్లాలు చూశాను. రెండు సార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎమ్మెల్సీ, మూడుసార్లు టీటీడీ బోర్డు సభ్యుడిగా ఎన్నికయ్యానంటే బడుగు బలహీనవర్గాల ప్రజల దీవెనలే కారణం. వారిని ఎప్పటికీ మర్చిపోను' అని టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి అన్నారు. సోమవారం నారాయణపురంలో మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జంగా కృష్ణమూర్తికి పల్నాడు బడుగు బలహీన వర్గాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సన్మానసభ జరిగింది. సభకు ముఖ్యఅతిధిగా హాజరైన జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ కార్మిక నాయకుడిగా మొదలైన తన రాజకీయ జీవితం గ్రామ సర్పంచ్ నుంచి ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, టీటీడీ బోర్డు సభ్యుడిగా నియామకం కావడానికి బడుగు బలహీనవర్గాలకోసం తాను చేసిన పోరాటమే కారణమన్నారు. పల్నాడు ప్రాంతంలోనే కాకుండా రాష్ట్రం నలుమూలల వున్న ఎంతో మంది బడుగు బలహీన వర్గాల నాయకులు ఐక్యంగా వుండి ఆర్థిక, సామాజిక, రాజకీయంగా పురోభివృద్ధి సాధించాలన్నారు. తనకు టీటీడీ బోర్డు సభ్యుడిగా పదవి రావడానికి సహకరించిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సభకు దాచేపల్లి 14వ వార్డు కౌన్సిలర్ షరీఫ్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో బెహరా వెంకట శ్రీనివాసరావు, గద్దల వేదమణి, కనిగిరి విశ్వనాథం, మందా శంకర్, పెరుమాళ్ల వెంకట నరసింహారావు, హసన్ అహ్మద్, హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈ నిర్లక్ష్యానికి మందు లేదు !



ఒక పక్క ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులులేక రోగులు అల్లాడిపోతున్నారు. వచ్చిన మందులను వైద్యఆరోగ్యశాఖ అధికారులు ఆస్పత్రులకు పంపిణీ చేయకుం డా వ్యర్థం చేస్తున్నారు. ఆ మాటలకు బలం చేకూర్చేదే ఈ చిత్రం. గుంటూరు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలోని సెంట్రల్ డ్రగ్‌స్టోర్ పక్కనేవున్న భవనం లో రోగులకు అందజేయాల్సిన మందులను ఇలా వరండాలో బయట పడేసారు. అవి వర్షానికి తడుస్తూ.. ఎండకు ఎండుతున్నాయి. జిల్లా కార్యాలయంలోనే ఈ స్థాయిలో నిర్లక్ష్యం ఉంటే ఇక గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో పరిస్థితి ఏమిటో.! - గుంటూరు సిటీ

యూనియన్ బ్యాంక్
విశేష సేవలు

- దేశవ్యాప్తంగా 8,500 శాఖలు
- 9000 ఏటీఎంలు
- ఆల్ ఇండియా యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరి మెండు మహేంద్ర భాస్కరరావు

కర్లపాలెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో 1919 సంవత్సరంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నాలుగు బ్రాంచ్‌లతో ప్రారంభమై నేడు 8,500 బ్రాంచ్‌లకు విస్తరించిందని, 9000 ఏటీఎంలతో ఖాతాదారులకు విశేష సేవలదిస్తుందని ఆలిండియా యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ కాంగ్రెస్ జనరల్‌సెక్రటరి మెండు మహేంద్రభాస్కరరావుఅన్నారు. యూనియన్ బ్యాంక్ కర్లపాలెంశాఖలో సోమవారం 106వ ఫౌండేషన్ దినోత్సవాన్ని మేనేజర్ కె.మానసా ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న భాస్కరరావు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1973వ సంవత్సరంలో కర్లపాలెంలో యూనియన్ బ్యాంక్ స్థాపించారని, 30 వేల మంది ఖాతాదారులకు యూనియన్ బ్యాంక్ విశేష సేవలం దిస్తుందన్నారు. చిన్న వృత్తి, వ్యవసాయాదారులకు, చేతి వృత్తిదారులకు, స్వయం సహాయక సంఘాలకు, చిన్నపెద్ద పరిశ్రమలకు అనేక రంగాల వారికి యూనియన్ బ్యాంక్ ఆర్థికసాయం అందిస్తూ దేశ, ఆర్థిక సామాజిక అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. ప్రస్తుత ఎండీ, సీఈవో మని మొక్కలాయ్ వివిద రంగాల్లో బ్యాంక్ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. సిబ్బంది కృషితోనే బ్యాంక్ నేడు ఈ స్థాయికి చేరుకుందని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మేనేజర్ కె.మానస, ఏపీఎమ్ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ మేనేజర్ భాను, యూనియన్‌బ్యాంక్ సిబ్బంది అనీషా, మనోజ్, గోపి, జగదీష్‌కుమార్, రాజమోహన్‌రెడ్డి, జనకమహరాజు, ప్రసాద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మెండు మహేంద్రభాస్కరరావు

ముగిసిన రాష్ట్రస్థాయి
బేస్‌బాల్ పోటీలు

- బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటిన గుంటూరు జిల్లా జట్టు
- బాల, బాలికల విభాగంలో అండర్ 17కు ఎంపికైన నేషనల్ టీం



రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలలో బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన గుంటూరు జిల్లా జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ముఖ్య అతిథులు

ప్రత్తిపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుటూరుజిల్లా, యనమదల మండల పరిధిలోని యనమదల జడ్పీ హైస్కూల్లో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు సోమవారం ముగిసాయి. జాతీయ జట్టుకు ఎంపికలతో పాటు వివిద జిల్లాల మధ్య పోటీలు నిర్వహించారు. గుంటూరు జిల్లా బాలికలు సత్తాచాటి రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచారు. బాలుర విభాగంలో విజయనగరం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే రాష్ట్రం తరుపు నుంచి ప్రాతినిధ్యం వహించే జట్టును అన్ని జిల్లాల క్రీడాకారుల నుంచి ఎంపిక చేశారు. సెమీఫైనల్స్‌కు బాల బాలికల విభాగాలలో 8 జిల్లాల జట్లు తలపడగా అందులో 4 జిల్లా జట్లు ఫైనల్స్‌కు చేరాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీలలో బాలికల విభాగంలో ప్రథమస్థానంలో గుంటూరు జిల్లా, ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం, మూడవ స్థానంలో విజయనగరం, నాలుగవ స్థానంలో ప్రకాశం జిల్లా జట్లు నిలిచాయి. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో విజయనగరం, ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం, మూడవ స్థానంలో ప్రకాశం, నాలుగవ స్థానంలో కర్నూలు జిల్లా జట్లు నిలిచాయి. అనంతరం రోటరీక్లబ్ ఆఫ్ గుంటూరు సెంటినియల్ పీ.బాలసుబ్రమణ్యం,సర్పంచ్ ఆదినారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ చౌదరిబాబులు విజేతలకు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం నాగేశ్వరరావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయరావు, ఇంటర్నేషనల్ సాఫ్ట్‌బాల్ రెఫరీ జగదీష్ రెడ్డి, ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రటరీ పేరం మస్తాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీలలో బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన విజయనగరం జిల్లా జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ముఖ్య అతిథులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

గణపవరంలో సీసీఐ కేంద్రం ప్రారంభం

నాదెండ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలోని వెంకట కృష్ణ కాటన్ కంపెనీలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. నాణ్యత గల పత్తికి క్వింటాకు రూ.7,521, రెండో రకం పత్తి తేమ శాతం ఉంటే రూ.7,121 ధరగా నిర్ణయించారు. ఈ సందర్భంగా సీసీఐ బయ్యర్ రమేష్ మాట్లాడుతూ రైతులు పత్తిని గోనె సంచుల్లో గాని, విడిగా గాని తీసుకురావాలని సూచించారు.

జోన్ డైరీ

● చిలకలూరిపేట: ఆర్టీసీలో సమస్యలపై మంగళవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు బస్సు డిపో మేనేజర్ ఎస్.రాంబాబు సోమవారం తెలిపారు. సమస్యలపై 9959225427కు తెలియజేయాలని కోరారు.

జొన్నలగడ్డ సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

నరసరావుపేట టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నలగడ్డ రెవెన్యూ సర్వేయర్ కే రామాంజనేయులు అనేక అవకతవకలకు పాల్పడ్డారని, అతనిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్, ఆర్డీవోలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎం నాయకుడు నల్లపాటి రామారావు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన

బొల్లాపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల కేంద్రమైన బొల్లాపల్లి ఆరోగ్య కేంద్రలో జిల్లా మలేరియా వైద్యాధికారి రవీంద్ర రత్నాకర్ ఆస్పత్రిని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి మలేరియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ పీ శంకర్ నారాయణ, ఎంపీఈవో ఎస్ రవి, పద్మావతి, సుమతి, ఏఎన్ఎం, ఆషా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్ఎఫ్, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డిపాలెంలో విద్యుత్ వినియోగంపై అవగాహన

బొల్లాపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెంలో పల్నాడు జిల్లా నూతన సర్కిల్ ఆఫీసు సూపరింటెండెంట్ డాక్టర్ పత్తిపాటి విజయకుమార్ రెడ్డిపాలెం గ్రామస్థులకు విద్యుత్ వినియోగంపై ఆదివారం రాత్రి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామస్థులతో కలసి రాత్రి బస చేశారు. కార్యక్రమంలో ప్రకాష్ మాస్టారు, గ్రామస్థులు పాల్గొన్నారు.

న్యాయవాదుల గుమస్తాల సమావేశం

వినుకొండ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం న్యాయవాదుల గుమస్తాల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటి ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షుడిగా కె.చిన్నదానం, ప్రధాన కార్యదర్శులుగా జి.నరసింహరావు, మరియబాబు, యన్.దేవయ్యలను ఎన్నుకున్నారు.

చార్టెడ్ ఎంప్లాయీస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బ్రహ్మానాయుడు

వినుకొండ టౌన్, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇరిగేషన్, రోడ్లు, బిల్డింగ్స్, పబ్లిక్ హెల్త్, పంచాయతీరాజ్, మున్సిపల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం సోమవారం విశాఖపట్టణంలో జరిగింది. ఈ సమావేశంలో ఏకగ్రీవంగా చార్టెడ్ ఎంప్లాయీస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వినుకొండ పట్టణానికి చెందిన ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కె.బ్రహ్మానాయుడును కో ఆప్షన్ పద్ధతి ద్వారా నియమించడం జరిగిందని బ్రహ్మానాయుడు ఒక ప్రకటనలో తెలియజేశారు.

200 మందికి నేత్ర వైద్య పరీక్షలు

చిలకలూరిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఆర్ కాలనీ పార్క్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నరసరావుపేట మ్యాక్స్ విజన్ సంస్థ వారి సహకారంతో సోమవారం పార్క్‌లో నేత్ర వైద్య పరీక్షలను నిర్వహించారు. సుమారు 200మంది పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్ళజోళ్ళు అందించారు. నేత్ర శస్త్రచికిత్సలు అవసరమైన వారికి నరసరావుపేటలో ఉచితంగా చేస్తామని మాక్స్ విజన్ సంస్థ వారు ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు ఎల్ ఆదినారాయణరెడ్డి, అధ్యక్ష కార్యదర్శులు గుడిపల్లి సాంబశివరావు, ఆరెకట్ల కోటి సుబ్బారావు, కోశాధికారి సీహెచ్ శ్రీనివాసరావు, బిట్రా సాంబశివరావు, కె నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో చౌదరయ్య స్కూలు విద్యార్థుల ప్రతిభ

చిలకలూరిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో జరిగిన 9వ జాతీయ ఆహ్వాన కరాటే చాంపియన్ షిప్ పోటీలలో స్థానిక సాదినేని చౌదరయ్య పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు కటా విభాగంలో పలు పతకాలు సాధించారు. ఎండీ షాజియా బంగారు పతకం, యగ్నిక, త్రిపుర, వైష్ణవి, పూర్వి వెండి పతకాలు, ప్రణీత, స్వాతి, నరేంద్ర, రోహిణి కాంస్య పతకాలు సాధించారు. వీరిని స్కూలు యాజమాన్యం, డైరెక్టర్, ప్రిన్సిపాల్ అభినందించారు.

మహంకాళి ఆలయానికి విరాళం

నరసరావుపేట రూరల్, నవంబరు 11: (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసప్పాలెం లోని మహంకాళి అమ్మవారి ఆలయ పునఃనిర్మాణం కోసం నరసరావుపేటకు చెందిన పీవీఎస్ విజయకుమార్ ధర్మపత్ని లక్ష్మీమాధురి దంపతులు రూ.1,01,116/- విలువగల చెక్కును ఆలయ కార్యనిర్వహణ అధికారి నలబోతు మాధవీదేవికి అందజేశారు. అనంతరం ఆలయంలో మహంకాళి అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో దాతలు పీవీఎస్‌విజయకుమార్, లక్ష్మీమాధురి దంపతులు పాల్గొన్నారు. కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలి

● కలెక్టర్ అరుణ్‌బాబు



అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు, ఇతర అధికారులు

నరసరావుపేట టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి పిర్యాదు పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ పీ అరుణ్ బాబు అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన 110మంది అర్జీదారులు తమ వినతులను జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణ్‌బాబు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో నలుమూలల నుంచి అర్జీదారులు ఇక్కడకి వస్తుంటారని అన్నారు. అటువంటి వారి సమస్యలను సావధానంగా విని, సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, ఆ పరిష్కారంతో అర్జీదారు సంతృప్తి చెందాలని సూచించారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరిష్కారం చూపాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● మండలంలోని ములకలూరు, గోళ్ళపాడు మధ్యలో ఉన్న శ్రీవిజయలక్ష్మి టౌన్‌షిప్ వేద మెడోస్ వెంచర్ యాజమాన్యం ఆర్ అండ్ బీ రోడ్లు, ఎస్ఎస్‌పీ కాలువలు ఆక్రమించారని ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. సోమవారం కలెక్టర్ వద్ద ఆందోళన నిర్వహించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ వెంచర్‌లో ఎస్ఎస్‌పీ కాలువ, ఆర్ అండ్ బీ రోడ్లను గార్డెన్ కోసం ఉపయోగించుకొని గార్డెన్ నిర్మాణం చేశారన్నారు. దీనిని చూపించి ప్లాట్లు అమ్మకాలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు, షేక్ మస్తాన్‌వలి, జీ రామకృష్ణ, నల్లపాటి రామారావు, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటానాయక్, పౌర హక్కుల సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ శిఖినం చిన్న, బీసీ సంఘం నాయకుడు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● ఎస్సీ కార్పొరేషన్ రుణాలు నిజమైన లబ్ధిదారులకు అందేలా చూడాలని ఎంఆర్‌పీఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్య కోరారు, సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా పరిష్కరా వేదికలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ఎస్ జిల్లా కమిటీ సీహెచ్ సాల్మన్‌రాజు, జీ ప్రభుదేవా, నరేష్, రత్నకుమార్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో వైభవంగా కార్తీక అభిషేకాలు



ప్రత్యేక అలంకారంలో భీమలింగేశ్వర స్వామి, కామేశ్వర స్వామి

నరసరావుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయాల్లో కార్తీకమాస వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. కార్తీక సోమవారం పురస్కరించుకొని శివునికి రుద్రాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారు జామునే ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయాల ప్రాంగణాల్లో పెద్దఎత్తున దీపారాధనలు చేశారు. గంగాపార్వతి సమేత భీమలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. బరంపేటలోని వాయుమల్లేశ్వర స్వామి ఆలయం, శృంగేరి శంకర మఠంలో చంద్రమౌళీశ్వర స్వామికి, లింగంగుంట్ల శివాలయం, బాలయ్య నగర్ శివాలయంలో అభిషేకాలు జరిగాయి. భక్తులు అధికసంఖ్యలో అభిషేక పూజల్లో పాల్గొన్నారు. పల్నాడు రోడ్డులోని సత్యనారాయణస్వామి దేవాలయంలో, పట్టణంలోని మహాశివుని విగ్రహం వద్ద భక్తులు దీపారాధనలు చేశారు.

భక్తులతో కిటకిటలాడిన కోటప్పకొండ

కోటప్పకొండ (నరసరావుపేట రూరల్), నవంబరు 11: (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో కార్తీక సోమవారం శివనామస్మరణతో మార్మోగిపోయింది. కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల నుంచి భక్తులు కోటప్పకొండకు భారీగా తరలివచ్చారు. కార్తీక సోమవారం సందర్భంగా కోటప్పకొండలో త్రికోటేశ్వరస్వామి వారికి విశేష అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి దాసరి చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తుల సందడి నెలకుంది. కార్తీక సోమవారంతో మహిళా భక్తులు ఆలయాలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్తీక దీపారాధనలు చేశారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● బొల్లాపల్లి: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని మండలంలోని వెల్లటూరు, పేరూరుపాడు, వడ్డెంగుంట, బొల్లాపల్లి తదితర గ్రామాల్లో సోమవారం తెల్లవారు జాము నుంచే దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వెల్లటూరు శ్రీ మంజునాథేశ్వర గంగా పార్వతి సమేత సోమేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● శావల్యాపురం: శావల్యాపురం రైల్వేగేటు సమీపంలో ఉన్న కోదండ రామాలయంలో మహిళలు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయపూజారి రావిపాటి సాయిభరత్‌శర్మ ఆధ్వర్యంలో రామాలయం ప్రాంగణంలోని ఉసిరి చెట్టు వద్ద కార్తీక దామోదరుని చిత్రపటాన్ని ఏర్పాటుచేసి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయంలో సత్యనారాయణ స్వామికి వ్రతాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శావల్యాపురం టీడీపీ అధ్యక్షుడు నలమాటి వెంకటేష్, ఎన్.సూరిబాబు, వి.రాంబాబు, వట్టికూటి శ్రీను, పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: రొంపిచర్లలోని శంకర స్వామి, వడ్లమూడివారిపాలెంలోని నీలకంఠేశ్వర స్వామి, గోగులపాడులోని చంద్రమౌళేశ్వర స్వామి, విప్పర్లలోని వల్లభేశ్వర స్వామి, సంతగుడిపాడు, గోగులపాడు గ్రామాల్లోని వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో కార్తీక మాస పూజలు అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.

● నరసరావుపేట అర్బన్: నరసరావుపేట పట్టణంలోని మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలోని కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలోని కామేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేక పూజలను నిర్వహించారు.



కోటప్పకొండలో స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన

పేదలకు అండగా సీఎం సహాయనిధి: ఎమ్మెల్యే జీవీ

వినుకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇబ్బందుల్లో ఉన్న పేదలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం 24మంది లబ్ధిదారులకు రూ.13,30,679లక్షల చెక్కులను బాధిత కుటుంబాల వారికి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు లీలావతి దంపతులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు అందజేశారు.

దివ్యాంగ విద్యార్థులకు కార్తీక వనభోజనాలు

బొందిలిపాలెం (శావల్యాపురం) నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురం భవితా పాఠశాల్లోని దివ్యాంగ విద్యార్థులకు కార్తీక వన భోజనాల కార్యక్రమాన్ని మండలంలోని బొందిలిపాలెంలోని అడవి పేరంటాలమ్మ దేవాలయం ఆవరణలో సోమవారం నిర్వహించారు. మాచర్ల మండలం ఏడవ మైలు ఎత్తిపోతల గిరిజన ఆశ్రమ పాఠశాల్లో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న రాగిపాటి నాగమల్లేశ్వరి సొంత ఖర్చులతో దివ్యాంగులకు భోజనాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎంఈవోలు మద్దిగుంట్ల సాంబశివరావు, పుసులూరి లలితాకుమారి, శావల్యాపురం జడ్పీపాఠశాల హెచ్ఎం బొడ్డపాటి విజయలక్ష్మీలు పాల్గొని విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. భవిత పాఠశాల ఉపాధ్యాయులు జగన్మోహన్‌రెడ్డి, పార్వతి, ఎంఆర్సీ సిబ్బంది త్రివిక్రమ్, శ్రీహరి, శ్రీనివాసరావు, ఏడుకొండలు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణసేవా సమితి ఆధ్వర్యంలో ..

చిలకలూరిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిత్య బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో చిన్న పసుమర్రు వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న సమితి నూతన ప్రాంగణంలో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ రమణ, పల్నాడు జిల్లా ప్లానింగ్ ఆఫీసర్ జి శ్రీనివాసులు, రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమాఖ్య గౌరవాధ్యక్షుడు కొప్పరపు బలరామమూర్తి, ఆడిటర్ గబ్బిటి బాలసుబ్రమణ్యం, శనగల హనుమత్ శాస్త్రి, యడ్లపాటి రమేష్ బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సమితి గౌరవాధ్యక్షులు చల్లా విజయకుమార్ అధ్యక్షత వహించారు.

సుగాలి కాలనీలో పట్ట పగలు దొంగతనం

చిలకలూరిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుగాలి కాలనీలో సోమవారం ఉదయం 9గంటల ప్రాంతంలో దొంగతనం జరిగింది. జరపల శ్రీనివాస్ నాయక్ భార్యను ద్విచక్ర వాహనంపై దించిరావడానికి వెళ్లిన సందర్భంలో గుర్తుతెలియని వ్యక్తి ఇంటి తలుపులు, బీరువా పగలగొట్టి రూ.10వేలు నగదు కాజేశాడు. చిలకలూరిపేట అర్బన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవం

నరసరావుపేట టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెట్లూరివారిపాలెం ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దేశ మొదటి విద్యాశాఖమంత్రి మౌలానా అబ్దుల్ కలామ్‌ఆజాద్ జయంతి సందర్భంగా నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున, డిప్లొమా ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో...

నరసరావుపేట రూరల్, నవంబరు 11: (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో బేసిక్ సైన్సెస్, హ్యూమానిటీస్ విభాగం ఆధ్వర్యంతో భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ విద్యా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో డా.ఎస్. వెంకటేశ్వర్లు, ఎన్ఈసీ ప్రిన్సిపాల్, డా.కె. పొన్నారి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో...

కేశానుపల్లిలోని ఈశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నేషనల్ ఎడ్యుకేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, పీపీటీ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు తెలిపారు.

కోతులు, కుక్కలు, పందుల బెడదపై కమిషనర్‌కు ఏఐవైఎఫ్ వినతి

వినుకొండ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలో ప్రజలను ఇబ్బందులు పెడుతున్న కోతులు, కుక్కలను, పందులను పట్టించాలని కోరుతూ సోమవారం ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు దండిపోయిన వెంకటఅజయ్‌కుమార్, తంగిరాల రమేష్‌బాబు తదితరులు మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌కు వినతి పత్రం అందజేశారు. కుక్కలు, కోతులు వలన పట్టణ ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీటిని పట్టించి అడవుల్లో వదిలిపెట్టాలని కమిషనర్‌ను కోరారు.

ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపట్టండి: ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, నవంబరు 11: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యంను ఇచ్చి త్వరితగతిన పరిష్కరించేలాతక్షణ చర్యలు చేపట్టాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సోమవారం అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్య క్రమంలో ఆయన సోమవారం పాల్గొని ప్రజల వద్ద నుండి వివిధ అంశాలకు సంబంధించిన 51 ఫిర్యాదులను స్వీకరించారు. మండలంలోని జొన్నలగడ్డ గ్రామానికి చెందిన ఉప్పుటూరు వెంకట్రావు నాలుగు సంవత్సరాల క్రితం ఎలక్ట్రికల్ స్మార్ట్ మీటర్ల సబ్ కాంట్రాక్ట్ కొరకు చాగంటి కృష్ణ అనే వ్యక్తి ద్వారా మద్దపాటి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఖాతాకు రెండు విడుదలగా రూ.23లక్షల రూపాయలు ఇచ్చానని సదరు కాంట్రాక్టులు ఇవ్వకుండా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్లు ఫిర్యాదు చేశారు. మండలంలోని కేసనపల్లి గ్రామానికి చెందిన రాంబాబు తన ఖాతాలో రూ.13 లక్షల 22,389 ఉండగా తన ఖాతాను హ్యాక్ చేసి రూ.11,50,000 విత్ డ్రా చేశారని డబ్బులు ప్రిన్స్ కుమార్ సింగ్ అనే వ్యక్తి ఖాతాలో జమఅయ్యాయని ఫిర్యాదు చేశారు. బొల్లాపల్లి మండలం గండి గనుమల గ్రామానికి చెందిన బోజియానాయక్ అనే వ్యక్తి తనకు దుర్గారావు అనే వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తారని రూ రెండు లక్షల 50 వేలు తీసుకున్నాడని మరో ఇద్దరిది కూడా ఇదేవిధంగా తీసుకొని ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశారని న్యాయం చేయవలసిందిగా ఫిర్యాదు చేశారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి

చిలకలూరిపేట, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని సోమవారం పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హాజీ షేక్ సలాం, షేక్ నసురుద్దీన్, ఎం రాధాకృష్ణ, హాజీ షేక్ సలాం తదితరులు పాల్గొన్నారు. చిలకలూరిపేట మండలం బొప్పూడిలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూలులో హెడ్ మాస్టర్ బి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

● నరసరావుపేట రూరల్: స్థానిక న్యూ ఆంధ్ర స్కూల్‌లో స్వాతంత్ర్య సమర యోధులు, మొదటి విద్యాశాఖమంత్రి భారతరత్న అబుల్‌కలాం ఆజాద్ జన్మదిన వేడుకలు మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, జిల్లా కార్యదర్శి మాబు, ఖాసిం పీరా, నరసరావుపేట టౌన్ ప్రెసిడెంట్ రఫీ, జిక్రియ, నియోజకవర్గ, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. మండలంలోని కేశానుపల్లి పంచాయతీ పరిధిలోగల ఎస్ఆర్‌కేటీ కాలనీలో సోమవారం అబుల్ కలాం ఆజాద్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఫ్రూట్స్, బిస్కెట్స్ పంపిణీ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుకను అందజేయాలి: మారుతివరప్రసాద్

వినుకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చెప్పినట్లుగా ఉచిత ఇసుకను వెంటనే అందజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని గృహనిర్మాణదారులు, భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్మాణ కార్మిక పనులకు వెళ్ళే మెట్ట ప్రాంతంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పినట్లుగా ఉచితంగా ఇసుక అందడం లేదని ప్రభుత్వం క్వారీలను నిర్వహించి ఉచిత ఇసుకను ప్రజలకు అందజేయాలని కోరారు. ఉచిత ఇసుక దొరకనందున గృహనిర్మాణాలు తగ్గిపోయి భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండా పోతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బూదాల శ్రీనివాసరావు, ఉలవలపూడి రాము, ఏఐటీయూసీ నాయకులు కె.షేక్ చిన్న సుబాని, శ్రీను, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సంసిద్ విద్యార్థుల ప్రతిభ

కనమర్లపూడి (శావల్యాపురం) నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జపాన్ షితో ర్యూ కరాటే స్కూల్ శుకొకై ఇజుషి వారి ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన గుంటూరు జిల్లా మంగళగిరిలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన 9వ నేషనల్ ఇన్విటేషన్ కరాటే చాంపియన్ షిప్-2024 పోటీలలో శావల్యాపురం మండలం కనమర్లపూడి గ్రామ సమీపంలోని సంసిద్ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొని అత్యున్నత ప్రతిభను కనబరచి బంగారు, రజత, కాంస్య పతకాలను కైవశం చేసుకొన్నట్లు పాఠశాల హెచ్ఎం ఒంటేరు నాగసురేష్ సోమవారం తెలిపారు. హెచ్ఎం మాట్లాడుతూ కరాటే చాంపియన్ షిప్‌లో అండర్-14 విభాగంలో ఉమ్మడి గుంటూరు జిల్లా తరఫున పాల్గొన్న సంసిద్ విద్యార్థులు పోటీల్లో బాగా రాణించి 14 బంగారుపతకాలు, 8 రజత పతకాలు, 8 కాంస్యపతకాలు సాధించినట్లు తెలిపారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు

● ఏవో అబ్బూరి అంకారావు

ఫటాఫట్



బొల్లాపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాగు ప్రారంభించే ముందు భూమిలో పోషక లోపాలను ముందుగా తెలుసుకునేందుకే భూసార పరీక్షలు ఎంతగానో మేలు చేస్తాయని మండల వ్యవసాయ అధికారి అబ్బూరి అంకారావు ఆంధ్రజ్యోతికి తెలిపారు. వ్యవసాయంలో భూసార పరీక్షలు, వాటి ప్రయోజనాలపై వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రశ్న: భూసార పరీక్షలు అంటే ఏమిటి?

జవాబు: నేలలో సహజంగా ఉండే పోషక పదార్థాలు ఏ మోతాదులో ఉన్నాయి? పంటలకు సమపాళ్ళల్లో అందుతాయా? లేదా? అనే విషయాలను ముందుగా గుర్తించడమే భూసార పరీక్ష.

ప్ర: భూసార పరీక్షకు మట్టిని ఏ విధంగా సేకరిస్తారు?

జ: సాగు చేపట్టబోయే భూమిలో మట్టి నమూనాలను సేకరిస్తాం, అందుకు పంట భూమిలో త్రిభుజాకారంలో 15 నుంచి 20 సెంటీ మీటర్ల వరకు పారతో గుంతతీసి అందులో పైపొర నుంచి కింద వరకు ఒక పక్కకు మట్టిని సేకరిస్తాం. ఎకరానికి ఎనిమిది పదిచోట్ల ఈ విధంగా మట్టిని సేకరించి దానిని మొత్తం కలిపి నాలుగు భాగాలుగా చేస్తాం. ఈ విధంగా మట్టి ఒక కిలో వచ్చే వరకు ఉంచి దానిని పరీక్షలకు వినియోగిస్తాం.

ప్ర: నమూనాల ఫలితాలను ఎన్ని రోజుల్లో వెల్లడిస్తారు?

జ: మట్టి నమూనాలను గుంటూరు సాయిల్ టెస్ట్ లేబొరేటరీకి పంపుతామని, అక్కడ పరీక్షించేందుకు 15రోజులు పడుతుంది. ఫలితాలు సాయిల్ టెస్ట్ ప్రత్యేక యాప్ ద్వారా సంబంధిత వ్యవసాయ అధికారికి, సిబ్బందికి అందిన అనంతరం రైతులకు వెల్లడిస్తాం.

ప్ర: ఏ సీజన్ పరీక్షలకు అనువుగా ఉంటుంది?

జ: మే, జూన్‌లు భూసార పరీక్షలకు అనువైన సమయంగా చెప్పవచ్చు. ఆ సమయంలో గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల ద్వారా సిబ్బంది రైతుల పేర్లు నమోదుచేసి శాంపిల్స్ సేకరిస్తారు.

ప్ర: లోపాలను ఏ విధంగా అధిగమిస్తారు?

జ: పరీక్ష ఫలితాల్లో పొటాషియం, జింకు వంటి లోపాలు ఎక్కువగా కన్పిస్తాయి. వాటి నివారణకు ప్రభుత్వం ద్వారా రాయితీపై పోషకాలను రైతులకు అందించి సమపాళ్ళల్లో భూమిలో కలయపెట్టేస్తాం.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

రాష్ట్రస్థాయి పోటీల్లో శావల్యాపురం బాలికల ప్రతిభ

శావల్యాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నంద్యాలలో జరిగిన సీనియర్ మహిళల బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో శావల్యాపురం జడ్పీ పాఠశాలకు చెందిన పదిమంది బాలికలు సత్తాచాటి ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టును మూడోస్థానంలో నిలిపినట్లు పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యున్నత ప్రతిభ కనబరచిన పాఠశాల పూర్వ విద్యార్థిని ముక్కపాటి లిఖితను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాల్‌బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెలలో మహారాష్ట్రలో జరగనున్న జాతీయస్థాయి పోటీలలో లిఖిత పాల్గొననున్నట్లు తెలిపారు. పాఠశాలకు చెందిన సీనియర్ ఇంటర్ విద్యార్థిని ఆకుమల్ల సమీర, జూనియర్ ఇంటర్ విద్యార్థిని వేముల దివ్యలను త్వరలో జరగనున్న రాష్ట్ర సీనియర్ మహిళల ఫెడరేషన్ కప్ జట్టుకు ప్రాబబుల్స్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. రానున్న పోటీల్లో కూడా బాలికలంతా బాగా రాణించి భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని కోరారు. ప్రతిభ చూపిన బాలికలను పీఎంసీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, హెచ్ఎం బొడ్డపాటి విజయలక్ష్మి, స్టాఫ్‌సెక్రటరీ బీవీ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు, రవికుమార్, శ్రీకాంత్ అభినందించారు.



కోటప్పకొండలో తాగునీటి ప్లాంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

కోటప్పకొండ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. కార్తీక సోమవారం సందర్భంగా కోటప్పకొండలో త్రికోటేశ్వర స్వామికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. కార్తీక సోమవారం సందర్భంగా నరసరావుపేట శాసనసభ్యుడు అరవింద బాబు కోటప్పకొండలో పర్యటించారు. త్రికోటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం కోటప్పకొండలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మంచి నీటి ప్లాంట్‌ను ప్రారంభించారు.

రూ.55 కోట్లతో ప్రధాన మురుగు కాలువలు

● నిర్మాణానికి అధికారుల పరిశీలన

చిలకలూరిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో జాతీయ రహదారికి ఇరువైపులా రూ.55కోట్ల వ్యయంతో శాశ్వత మురుగు కాలువల నిర్మాణానికి రంగం సిద్ధమవుతున్నది. మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిరావు, డీఈ రహీం, నేషనల్ హైవేస్ రెసిడెంట్ ఇంజనీర్ ప్రసాద్, ఏఈ అశోక్ తదితరులతో కూడిన అధికారుల బృందం సోమవారం కాల్వల నిర్మాణం జరిగే ప్రదేశాలను పరిశీలించారు. హైవేస్ ఇంజనీరింగ్ అధికారులు అంచనాలను తయారుచేసి ఆమోదం కోసం ఢిల్లీకి పంపనున్నారు. అనంతరం నిధులు మంజూరు కానున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా మురుగునీటి కాలువలు లేక పట్టణ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా శ్మశానం, ఏఎంజీ సంస్థ ప్రాంతాలలో వర్షపు నీరు జాతీయ రహదారిపైకి ప్రవహిస్తున్నది. రోజుల తరబడి సర్వీస్ రోడ్లపై వర్షపు నీరు నిలిచి ఉంటున్నది. ఈ నేపథ్యంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు సంయుక్తంగా సమస్యను కేంద్ర మంత్రి గడ్కరీ దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణం మురుగు కాలువల నిర్మాణాలను చేపట్టాలని కోరుతూ ప్రతిపాదనలు అందచేశారు. మంత్రి సానుకూలంగా స్పందించడంతో నిధులు మంజూరు కానున్నాయి. సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనున్నది.

కార్యనిర్వహణ అధికారిపై కమిషనర్‌కు ఫిర్యాదు

నాదెండ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాదెండ్ల గ్రామ సమీపంలోని నందికుంట విఘ్నేశ్వర దేవస్థానం, కార్యనిర్వహణ అధికారి ఎన్ తులసీదాసుపై సోమవారం దేవదాయ శాఖ కమిషనర్‌కు భక్తులు ఫిర్యాదు చేశారు. గడిచిన రెండు సంవత్సరాల్లో దేవస్థానంలో వచ్చిన ఆదాయం, వ్యయాలలో తప్పుడు లెక్కలు చూపి అవినీతికి పాల్పడ్డాడని ఆరోపించారు. దేవస్థానం వద్ద విచారణ జరిపి అవినీతి, అక్రమాలకు పాల్పడిన తులసీదాసుపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన దేవాలయానికి వచ్చినప్పుడు ఎంత ఆదాయం వస్తుందో తెలపాలని భక్తులు అడిగినా నా ఇష్టమంటూ సమాధానం చెప్పారని ఫిర్యాదు చేశారు.

వైసీపీ నేత ఒత్తిడితో లేని ఆదాయాన్ని చూపి...

గ్రామానికి చెందిన వైసీపీ నేత ఒత్తిడితో దేవాలయాన్ని దేవదాయ శాఖలో కలిపేందుకు తులసీదాసు సహకరించారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఈ దేవాలయానికి ధర్మకర్తలు ఉండగా 2022లో వైసీపీ నేత ఒత్తిడితో దేవదాయ శాఖలో కలిపారు. రూ.5లక్షలకు పైగా ఆదాయం ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. ఈ క్రమంలో ధర్మకర్తలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో కొంత సొమ్మును వ్యక్తుల నుంచి సేకరించి దేవాలయానికి సంబంధించిన బ్యాంక్ ఖాతాలో వేశారు. తిరిగి ఆ సొమ్మును వారికి ఇచ్చేందుకు తప్పుడు లెక్కలు చూపించి వ్యయంచేసినట్టు దొంగ లెక్కలు చూపారని భక్తులు ఆరోపిస్తున్నారు.